
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 157 | ది.23-9-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 157 | Date : 23-9-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


## ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కు సాదర వీడ్కోలు



**కాకినాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా పిఠాపురం లో రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగించుకొని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు కాకినాడ గోదావరి కళాక్షేత్రం నుండి రోడ్డు మార్గాన రాజమండ్రికి బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్,జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఇతర ప్రజా ప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు.

# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు

### కుప్పం నుంచి వర్చువల్ గా అభివృద్ధి పనులను ప్రారంభించిన ముఖ్యమంత్రి

- వీకెండ్ ఎకానమీ పెంచేలా చర్యలు చేపట్టాలి
- అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పట్టణాభివృద్ధి శాఖను తీర్చిదిద్దాలి
- పట్టణ స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రంలోని మున్సిపాల్టీలు-కార్పొరేషన్లలో రూ.11,359 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం



**కుప్పం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** పట్టణాలే అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు.. అధికారులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇంత భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్ర మున్సిపల్ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామన్నారు. రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్లుగా మారేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పట్టణాల్లో లివబిలిటీ మెరుగుపడటంతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయాలని చెప్పారు. పట్టణాల్లో వీకెండ్ ఎకానమీ విపరీతంగా పెరుగుతుందని సీఎం వివరించారు. ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61 శాతం డబ్బును వారాంతాల్లో ఖర్చు పెడుతున్నారని... అలాగే రవాణా నిమిత్తం 71 శాతం ఖర్చు పెడుతున్నారని వెల్లడించారు. దీనిపై అధికారులు.. ప్రజా ప్రతినిధులు మరింత అధ్యయనం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా వారాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గృహవసతి, రవాణా వంటి అవసరాలపై పట్టణ ప్రజలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్న నేపథ్యంలో టిడ్కో ఇళ్లతో పాటు స్త్రీశక్తి వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్మెంట్ విభాగం... అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

**టిడ్కో గృహాలు... ఇంటింటికి తాగు నీరు..** 2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. విశాఖ నగరంలో 28,500 కుటుంబాలకు ఇప్పటికే ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అభ్యంతరాలు లేని ప్రాంతాల్లో మరిన్ని పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# పారిశ్రామికవేత్తలుగా పౌల్ట్రీ రైతులు

### కుప్పం పౌల్ట్రీ రైతులతో ముఖాముఖీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- వాతావరణ అనుకూల పౌల్ట్రీ షెడ్ల ఏర్పాటుకు కార్యాచరణ
- ఐబీ గ్రూప్‌తో కలిసి కుప్పంలో పైలట్ ప్రాజెక్టు
- రైతులు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేలా రియల్ టైమ్‌లో అనుమతులు



**కుప్పం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** కుప్పం నియోజకవర్గంలోని పౌల్ట్రీ రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో వాతావరణ అనుకూల (ఎన్విరానమెంటల్లీ కంట్రోల్డ్) పౌల్ట్రీ షెడ్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి కార్యాచరణ చేపట్టినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కుప్పంలోని పౌల్ట్రీ రైతులతో సీఎం చంద్రబాబు మంగళవారం ముఖాముఖీ అయ్యారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధి, రైతులకు అందుతున్న అవకాశాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై ఈ ముఖాముఖిలో చర్చించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ఎన్విరానమెంటల్లీ కంట్రోల్డ్ పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రైతులను కేవలం పౌల్ట్రీ సాగుదారులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయాలన్న లక్ష్యంతో ఐబీ గ్రూప్‌తో కలిసి ఈసీ పౌల్ట్రీ షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**పౌల్ట్రీ రంగానికి ప్రత్యేక పాలసీ..** రైతులు ఎంఎస్ఎంఈలుగా ఎదగాలన్న ఉద్దేశంతో కుప్పంలో పెద్ద ఎత్తున ఈ తరహా పౌల్ట్రీ షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను రియల్ టైమ్‌లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేకమైన పాలసీని తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. డైరీ, పౌల్ట్రీ, ఉద్యానవనం, సెరీకల్చర్ వంటి రంగాలను ప్రోత్సహిస్తూ రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల్లో ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రొటీన్ అధికంగా ఉండే కోడిమాంసం, గుడ్ల వినియోగం పెరుగుతోందని చంద్రబాబు తెలిపారు. దీంతో పౌల్ట్రీ రంగానికి భవిష్యత్‌లో మరింత డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. కుప్పంలో ఉత్పత్తి అయ్యే పౌల్ట్రీ ఉత్పత్తులను వేగంగా ఇతర ప్రాంతాలకు తరలించేలా రోడ్డు, రైలు కనెక్టివిటీని పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. పెరుగుతున్న కనెక్టివిటీతో కుప్పం బెంగళూరుకు శాటిలైట్ టౌన్‌షిప్‌గా మారిపోయిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని కుప్పం నియోజకవర్గాన్ని వ్యాపార, పారిశ్రామికవేత్తలకు చిరునామాగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పౌల్ట్రీతో పాటు డైరీ, ఉద్యాన, సెరీకల్చర్ రంగాల్లోనూ అవకాశలను అందిపుచ్చుకుని రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు.

# కూటమి ప్రభుత్వం బలంగా ముందుకు సాగాలన్నదే నా కోరిక : డిప్యూటీ సీఎం.

- జనసేన గౌరవానికి భంగం కలగకుండా కలిసి పనిచేద్దాం
- పిఠాపురం ప్రజల నమ్మకాన్ని అభివృద్ధిగా తిరిగి ఇస్తున్నాం
- దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దడమే నా లక్ష్యం
- రూ.225 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ.. రూ.323 కోట్లతో ఉప్పాడకు రక్షణ గోడ
- రూ.86 కోట్లతో ఆసుపత్రులు, ఆరోగ్య వసతుల అభివృద్ధి
- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సభలో పవన్ కళ్యాణ్



**పిఠాపురం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** 'మన కూటమి ప్రభుత్వం మరింత బలంగా, సమర్థవంతంగా ముందుకు సాగాలన్నదే నా కోరిక. అందుకోసం ఎవరి గౌరవానికి భంగం వాటిల్లకుండా అందరం కలిసి పని చేయాలి. ముఖ్యంగా జనసేన పార్టీ గౌరవానికి భంగం వాటిల్లకుండా ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. నాకు కృతజ్ఞత చాలా ఎక్కువ. కష్టాల్లో ఉన్న మనిషికి అండగా నిలబడటం నా స్వభావం, నా గుణం. ఈ విలువలను ఈ నేల నేర్పింది. ప్రజల అభివృద్ధే మన ప్రధాన లక్ష్యం. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, వాటిని తీర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దాం. వారి ఆశలు, ఆకాంక్షలకు తరువాత ముందుకు తీసుకెళ్దాం. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నా క్యాంపు ఆఫీసును పిఠాపురంలో పెట్టడానికి ఏర్పాట్లు చేస్తాం' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. ఆ లక్ష్యంతోనే ఇప్పటికే వివిధ రంగాల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. తాజాగా మరో రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. పిఠాపురాన్ని కేవలం ఒక నియోజకవర్గంగా కాకుండా, అభివృద్ధికి నమూనాగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన గెలుపు రాష్ట్ర అభివృద్ధి కే కాకుండా దేశ అభివృద్ధికి పునాదిగా నిలిచిందని చెప్పారు. మంగళవారం పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పిఠాపురం నియోజక వర్గంలో గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని కళ్లముందు చూస్తున్నాం. వివిధ రంగాల్లో ఎన్నో కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్లాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా, పిఠాపురం భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ ముందుకు సాగుతున్నాం.

**600కు పైగా సీసీ, బీటీ రోడ్లు పూర్తి చేశాం..** అధికారం చేపట్టిన తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికే రూ.200 కోట్లకు పైగా నిధులు వెచ్చించి, ఇప్పటికే 600 కు పైగా సీసీ రోడ్స్, బీటీ రోడ్స్ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. మరో 202 రహదారులను ప్రారంభించాం. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో దాదాపు రూ.10 కోట్లతో నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆధునీకరించి, 97 వేల మందికి తాగునీటి భరోసా కల్పించాం. గ్రామాల్లో జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార నిధులతో దాదాపు రూ.320 కోట్లతో, పట్టణాల్లో అమృత్ 2.0, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహకారంతో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో దాదాపు రూ.140 కోట్లతో తాగునీటి పనులు చేపడుతున్నాం.

**ఆరోగ్య వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం..** పిఠాపురంతోపాటు పరిసర నియోజకవర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా రూ.34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నాం, ఇప్పటికే పనులు 50 శాతానికి పైగా పూర్తయ్యాయి.

# ప్రపంచస్థాయి మౌలిక వసతులు అభివృద్ధి చరిత్రాత్మకం..

- 26 జిల్లాల్లో 123 మున్సిపాలిటీలకు మహర్దశ.
- రూ 11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం.
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ శంకుస్థాపనలు మహోత్సవం.
- జిల్లాలో రూ 122 కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం
- నూజివీడు మున్సిపాలిటీలో రూ 35 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు.
- వర్చువల్ కార్యక్రమాన్ని తిలకించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...



**నూజివీడు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణం రోటరీ కళ్యాణ మండపంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 123 మున్సిపాలిటీలకు మహర్దశకు రూ 11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ఏలూరు నగర పాలక సంస్థకు రూ 50 కోట్లు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి రూ 19 కోట్లు, నూజివీడు మున్సిపాలిటీకి రూ 35 కోట్లు, చింతలపూడి మున్సిపాలిటీకి రూ 18 కోట్లు, జిల్లాలో రూ 122 కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం శుభపరిణామని అన్నారు. నూజివీడు మున్సిపాలిటీలో రూ 35 కోట్లు అభివృద్ధి పనులకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర పురోగతి, పట్టణాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పనకు ఒకేరోజు ఒకే మున్సిపాలిటీలో రూ 35 కోట్లు వెచ్చించడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని అన్నారు. నూజివీడు పట్టణ సమగ్రఅభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో మున్సిపాలిటీలకు రూ 122 కోట్లు, నూజివీడు మున్సిపాలిటీకి రూ 35 కోట్లు నిధులు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చెయ్యడం మంచి శుభ పరిణామం అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు రూపు రేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని శుభపరిణామం అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పట్టణాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను నేడు యుద్ధప్రాతిపదికన తిరిగి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు పట్టణంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, తదితర వసతులను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, నూజివీడు నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ఇచ్చే నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేకపోయారని, కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేకపోయారని అన్నారు. మెగా డీఎస్సీని గత ప్రభుత్వ నేతలు పూర్తిగా అపహాస్యం చేస్తున్నారని, ఒకేసారి 16,500 టీచరు పోస్టులు భర్తీ చేయడాన్ని జీర్ణించు కోలేకపోతున్నారని అన్నారు. ఈ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో 3 శాతం రిజర్వేషన్ కింద క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తే అందులో ఏ తప్పూ జరగకపోయినా ఏదో జరిగిపోయిందంటూ తన స్వంత పత్రికలు, ఛానళ్ల ద్వారా విషప్రచారం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీపై చేసిన ప్రతి ఆరోపణపై అధికారులతో పత్రికాముఖంగా వివరణలు ఇప్పించామని, గత ప్రభుత్వ హత్యలుపై, మద్యం కుంభకోణంపై గత ప్రభుత్వం ఎందుకు ప్రజలకు వాస్తవాలు చెప్పడంలేదని, ప్రజలే అర్థం చేసుకోవాలని అన్నారు. తన వైఫల్యాలు, అక్రమాలు, స్కాములు, దోపిడీలు బయటకు వస్తాయనే భయంతో ఎదుటివారిపై బురదజిమ్మడం గత పాలకుల నైజంమని అన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం కమీషనరు కొరపాటి పీరయ్య, ఇంజనీరింగు, వివిధ శాఖలు అధికారులు, పట్టణ ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


## CHAGE OF NAME

GANAGALLA VIJAY RAJU (OLD NAME ) S/O GANAGALLA ANANDARAO THALLAPALEM VILLAGE, BANDAR MANDALAM KRISHNA DISTRICT AP. I HAVE CHANGED MY NAME AS GANAGALLA VIJAY (NEW NAME )HERE AFTER MY NAME IS KNOW AS GANAGALLA VIJAY.

## దస్తావేజులు పోయినవి

ఎన్‌టీఆర్ జిల్లా, గురునానక్ నగర్, గురుద్వారా రోడ్డు, డోరు నెం.54-13-11 కాపురస్తులు పాతూరి వీరభద్రరావు గారి కుమారుడు పాతూరి వెంకట రమణమూర్తి అను నాకు సంబంధించినటువంటి మంగళగిరి సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో 1వ పుస్తకం నెం.4415/1982; 5598/2005; 5599/2005; 1949/2008; 1950/2008; 7344/2010ర్లుగా గల ఒరిజినల్ విక్రయ దస్తావేజులు కలిగిన కవర్‌ను బండికి తగిలించుకొని, ది.13-09-2026వ తేదీన గవర్నర్‌పేట ఆంధ్రా హాస్పిటల్ నుండి గురునానక్ నగర్‌లోని ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో కోర్టు పరిసరాలలో ఎక్కడో జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ దస్తావేజులు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజులు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజులను ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగి యుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం.9848122660


# భారీ వర్షాలపై కలెక్టరేట్ లో కమాండ్ కంట్రోల్ కేంద్రం

- 9154970454 నంబరుతో ఏర్పాటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అధికారుల క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా జిల్లాలోనూ వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వాగులు, కాలువల పరిసరాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 24 గంటలూ పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో రెవెన్యూ, వ్యవసాయం, విద్యుత్తు, వైద్య ఆరోగ్యం, పౌర సరఫరాలు తదితర శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వర్షాలు, వరదలు, నీట ముంపు లేదా ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు 91549 70454 కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చున్నారు. సహాయం కోసం సంప్రదించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్తు, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# సెప్టెంబర్ 26న విజయవాడలో జాబ్ మేళా

**● 14 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు -- 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత ● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**



**విజయవాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 9:00 గంటలకు విజయవాడ కేబిన్ కాలేజ్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 14 ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనేందుకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.12,000 నుంచి రూ.50,000 వరకు వేతనం, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పాన్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 9700092606, 9700025833, 8712495530 సెల్ నంబర్ల నందు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**● ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ప్రత్యేక పూజలు**



**పిఠాపురం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం, చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారి ప్రాతఃకాల సేవలో పాల్గొన్నారు. రాములవారికి అష్టోత్తరాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఏకాదశి వ్రతాచరణలో రామాలయ సందర్శనం విశిష్టమైన కార్యంగా చెప్పబడింది. అంతకు ముందు చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారి దర్శనానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సందర్శన అనంతరం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారి ఆలయం సమీపంలో సభ నిర్వహించిన విషయం తెలిసిందే. విజయం అనంతరం ఆలయ అభివృద్ధికి రెండు విడతలుగా దాదాపు రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ఆలయంలో కాలక్షేప మండపం, రథశాల, అన్నదానం కోసం హాలు, యాగశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

# షూటింగ్‌బాల్ సత్తా చాటేందుకు సిద్ధమా?



**కృష్ణా/ఎన్టీఆర్ జిల్లా,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ పురుషుల, మహిళల జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ సంఘం అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వా అంతర్జాతీయ పాఠశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో షూటింగ్‌బాల్‌పై ఆసక్తి ఉన్న 35 ఏళ్లలోపు పురుషులు, మహిళలు ఎంపికలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతితో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఎంపికైన కృష్ణాజిల్లా పురుషుల, మహిళల జట్లు అక్టోబర్ 11, 12 తేదీల్లో గుంటూరు నగరంలో నిర్వహించనున్న 9వ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయని రాజశేఖర్ తెలిపారు.

# శాస్త్రీయ ఆలోచనలకు పదును.. వీవీఎం రిజిస్ట్రేషన్లపై అవగాహన





**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న విద్యార్థి విజ్ఞాన మంథన్ (వీవీఎం) 2026--27 సంవత్సరానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లపై కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ పి. జగతి ఆధ్వర్యంలో గుడివాడ డివిజన్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏప్రిల్ 3 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యార్థులు నమోదు చేసుకోకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 30 రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ కావడంతో గుడివాడ డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి కొండా రవికుమార్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని విద్యార్థులను పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించేందుకు వీవీఎం మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం సెయింట్ జాన్స్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ వీరవల్లి, జవహర్ నవోదయ విద్యాలయం వేలేరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల వీరపనేనిగూడెం, మల్లికార్జున హైస్కూల్ గన్నవరం, సేక్రెడ్ హార్ట్ ఆరుగొలను, ఏపీఎస్ఆర్ఈఐఎస్ మోటూరు తదితర పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. సెయింట్ జాన్స్ గన్నవరం ప్రిన్సిపాల్ బ్రదర్ యేసు ప్రభాకరన్ మాట్లాడుతూ గతేడాది తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జిల్లా టాపర్లుగా నిలిచారని తెలిపారు. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు డిజిటల్ ఆధారిత జాతీయ స్థాయి విజ్ఞాన పరీక్షలో పాల్గొంటున్నారని చెప్పారు. గతేడాది మల్లికార్జున హైస్కూల్‌కు చెందిన ముగ్గురు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఒకరు, విశ్వభారతి హైస్కూల్ వీరవల్లికి చెందిన ఒక విద్యార్థి జిల్లా టాపర్లుగా నిలిచి ఫీజు మినహాయింపు పొందారని జిల్లా కోఆర్డినేటర్ పి. జగపతి తెలిపారు. ఈ ఏడాది కూడా మరింత మంది విద్యార్థులు వీవీఎంలో నమోదు చేసుకోవాలని కోరారు. 'వైజ్ఞానికంగా ఆలోచించండి.. ప్రతిరోజూ పరీక్ష రాయండి.. జాతీయ స్థాయిలో గెలవండి' అనే నినాదంతో విద్యార్థులను వీవీఎంకు సిద్ధం చేసేందుకు అవసరమైన అధ్యయన సామగ్రి, ఆన్‌లైన్ తరగతులు సెప్టెంబర్ 21 నుంచి అందుబాటులో ఉన్నాయని జగతి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# అలరించిన ఆకాశవాణి గాయకులు కరక రాజబాబు "భక్తి సంగీత గీతాలాపన"





**ముమ్మిడివరం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,ముమ్మిడివరం మండలం లో ఎంతో పురాణ ప్రాచిత్యం గలిగిన అయినవిల్లి ,శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం నందు గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా టి.వి మరియు ఆకాశ వాణి గాయకులు కరక రాజుబాబు చే స్వామివారి సన్నిధిలో నిర్వహించ బడిన "భక్తి సంగీత గీతాలాపన "ట్రాక్ షో కార్యక్రమంలో ఆలపించిన భక్తిగీతాలు, వీక్షించిన భక్తజన సందోహాన్ని విశేషంగా" అలరిం చాయి. ఎంతో అద్భుతంగా ఆలపించిన రాజుబాబు గానాన్ని ప్రశంసిస్తూ దేవస్థాన చైర్మన్ విల్లా సూర్యనారాయణ,ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులు మరియు కార్యక్రమ నిర్వాహక ప్రకాష్ ,గాయకులు రాజుబాబును అభినందిస్తూ,దుశ్శాలువనుకప్పి,ప్రశంసాపత్రంతో పాటు నగదు పారితోషికాన్ని ,తీర్థప్రసాదాలనందించి, ఘనంగా సత్కరించారు. అనంతరం గాయకుడు రాజుబాబు అందరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు.

# ఎంవీఎస్ సర్జికల్ నర్సింగ్ హోం లో ఆపరేషన్ ఫెయిల్యూర్ అయి మహిళ మృతి..



**తిరువూరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** తిరువూరు ఎంవీఎస్ నర్సింగ్ హోమ్ లో వైద్యులు ఆపరేషన్ చేస్తుండగా ఒక మహిళ మృతి చెందిన ఘటన తిరువూరులో జరిగింది దీనికి సంబంధించి మనసుమల్లి గ్రామానికి చెందిన బండారు కుమారి భర్త వెంకటేశ్వరరావు అను మహిళ రాత్రి ఆపరేషన్ చేసిన తర్వాత ఇబ్బందికరంగా ఉండడంతో విజయవాడ మంచి ట్రీట్మెంట్ కొరకు విజయవాడ పంపించగా చనిపోయిందని యాజమాన్యం చెబుతుండగా, మహిళలకు సంబంధించిన బంధువులందరూ చనిపోయిన తర్వాతే విజయవాడ పంపించారు ఠాగూర్ సినిమాలో లాగా ఎక్కడ జరిగిందని చెప్పేసి కుమారి కూతురు రోదిస్తూ చెప్తా ఉన్నది దీనికి సంబంధించిన బంధువులు గ్రామ పెద్దలు రాస్తారోకో ధర్నా నిర్వహి ంచారు పోలీస్ యంత్రాంగం పెద్దల సమక్షంలో కూర్చొని వందనాలు జరిపి మహిళకు సరైన న్యాయం జరగాలని బంధువులందరూ చూస్తున్నారు.

# మేము రెడీగా ఉన్నాం మీరు కూడా రెడీగా ఉండండి

**-రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ అర్చన**






**విస్సన్నపేట,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొండపర్వ గ్రామంలో రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ అర్చన రీ సర్వే అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామంలో రైతులందరికీ వాట్సాప్ గ్రూప్ తయారు చేస్తామని నోటీసు బోర్డులో సర్వే తేదీలు ప్రదర్శన జరుగుతోందని 90 రోజులపాటు జరిగే సర్వే కార్యక్రమంలో గ్రామ పరిధిలో అందుబాటులో ఉంటామని ప్రతి ఒక్కరూ తమ ఫోను భూ సర్వే కు సంబంధించిన డాక్యుమెంట్స్ ఆధార్ కార్డ్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వంద సంవత్సరాల తర్వాత తిరిగి జరిగే ఈ సర్వే గ్రామ పంచాయతీ పరిధిలో డ్రోన్ ప్లస్ రోవర్ తో 59 65 .41 ఎకరాల భూమిని కొలతలు చేస్తుందని ఒకసారి నమోదైన తర్వాత ప్రపంచంలో ఎక్కడ ఉన్నా డిజిటల్ మ్యాప్ ద్వారా మీ భూమిని మీ ఫోన్ లోనే చూసుకోవచ్చు అన్నారు. భూ సంబంధిత లావాదేవీలు ఏమి ఉన్న కొలతలు సమయానికి పరిసర ప్రాంత రైతుల తో కలిసి పాల్గొంటే జీవితంలో మళ్ళీ ఎలాంటి ఇబ్బంది ఉండదు అన్నారు. కొత్త పాస్ బుక్కులు సులువుగా పొందవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, వైసిపి కొండ పర్వ గ్రామ అధ్యక్షులు ఆర్ చంద్రశేఖర్, సర్వేయర్ శంకరరావు, వీఆర్వో చెన్నారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

# సొంత ఇంటి కలల సహకారానికి సిపిఎం నాయకులు మద్దతు..



**విస్సన్నపేట,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నాటి వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందించిన జగనన్న కాలనీ స్థాలాలలో మండలంలో ఇంటి నిర్మాణాలు విషయంలో సున్నా రిజల్ట్ ఉన్న విషయం సర్వత్రా తెలిసిందే. సుదీర్ఘకాలంగా సొంత ఇంటి కలల సహకారం చేసుకునేందుకు ఎదురుచూస్తున్న వారి కలలను సహకారం చేసేందుకు మండలంలో సిపిఎం పార్టీ నాయకులు నాగరాజు జ్ఞాన రత్నం తదితరులు నడుము కట్టారు. నివాసముండేందుకు అద్దెలు కట్టలేక సొంత నిధులతో పాటు మరికొంత అప్పు తెచ్చి అయినా ఇల్లు నిర్మాణాలు కడతామని చెప్పడంతో సిపిఎం నాయకులు వారి ఆలోచనలను సుగమం చేయడం జరిగింది. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న అప్పులు చేసైనా ఇంటి నిర్మాణాలు చేసుకోవాలనే లక్ష్యంతో ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. అదే సమయంలో విద్యుత్ ,నీరు తదితర మౌలిక వసతులు కొరకు తమ వంతు కృషి చేస్తామని సిపిఎం నాయకులు వెన్నంటి ఉండటం రాష్ట్రాన్ని పాలించిన నాడు నేడు నాయకులు ఈ విషయంపై స్పందించకపోవడం సర్వత్ర ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుంది.

# ఏ కొండూరు (మం) రామచంద్రపురం NHAI -30 విస్తరణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.జీ.జి.లక్ష్మీశ



**ఏ కొండూరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలనీ అధికారులను ఆదేశించిన కలెక్టర్.. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి పనుల పరిశీలన విస్తరణలో స్థలాలు కోల్పోతున్న బాధితులతో కలెక్టర్ ముఖాముఖి. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ రామచంద్రపురం పరిధిలో కిలోమీటరు మేర నిలిచిన రహదారి పనులు పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం సమన్వయంతో పనిచేసి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచన ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

# రీ--సర్వేలో భూ సరిహద్దులు, హక్కు పత్రాల వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలి

**-మల్లిబోయినపల్లి గ్రామంలో 6వ విడత రీ--సర్వే భూముల తనిఖీ**



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండలం మల్లిబోయినపల్లి గ్రామంలో 6వ విడత రీ--సర్వేలో భాగంగా జరుగుతున్న భూముల సర్వేను ఏలూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ అన్సారీ, నూజివీడు డిప్యూటీ సర్వే అధికారి రమణ, మండల సర్వేయ-ర్ సుంకర రామకృష్ణ బాబు, గ్రామ సర్వేర్లు దుర్గ, రమణ,పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో భూ సమస్యలు, భూముల సరిహద్దులు, సర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.రైతులు తమ భూముల సరిహద్దులను స్పష్టంగా తెలియజేయాలని అధికారులు సూచించారు. భూమికి సంబంధించిన దారి సమస్యలు లేదా ఇతర వివరాలు భూ రికార్డుల్లో నమోదై ఉంటే, వాటి ఆధారంగా రీ--సర్వేలో నమోదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం రీ--సర్వే సమయంలో రైతులు తెలియజేసే సమస్యలను నమోదు చేస్తే భవిష్యత్తులో సర్వే రికార్డుల్లో పొందుపరిచే అవకాశం ఉంటుందని వివరించారు. మల్లిబోయినపల్లి పట్టాదారులు తమ భూములకు సంబంధించిన దస్తావేజులు, పట్టాదారు పాస్‌పుస్తకం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు తదితర హక్కు పత్రాల జిరాక్స్ కాపీలను గ్రామ వీఆర్వోకు అందజేయాలని అధికారులు సూచించారు. రీ--సర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు భూ ఆసాములు సహకరించాలని కోరారు. మల్లిబోయినపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భూ యజమానులు కూడా తమ భూములకు సంబంధించిన హక్కు పత్రాల జిరాక్స్ కాపీలను సంబంధిత గ్రామ వీఆర్వోలకు అందజేయాలని అధికారులు సూచించారు.

# 400 మంది భక్తులకు అన్నప్రసాదం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. హనుమాన్ జంక్షన్‌కు చెందిన శ్రీ తుమ్మల సత్యనారాయణ, శ్రీమతి వాణిశ్రీ దంపతులు, వారి కుటుంబ సభ్యుల వితరణతో సుమారు 400 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రంతో సత్కరించి అభినందించారు. దేవస్థాన అధికారులు, అర్చకులు, ట్రస్టు బోర్డు సభ్యులు దాత కుటుంబ సభ్యుల సేవాభావాన్ని అభినందించారు. శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి అనుగ్రహం దాత కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# విద్యార్థుల వసతులకు లయన్స్ సహకారం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** విద్యాభివృద్ధితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు లయన్స్ క్లబ్ సహకారం అందిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్షుడు మత్తి సాంబశివరావు అన్నారు. పిరికిడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. లయన్ సీనియర్ నాయకుడు నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, అధ్యక్షుడు మత్తి సాంబశివరావు సంయుక్త సహకారంతో రూ.34 వేల వ్యయంతో టైల్స్ ఏర్పాటు, మరుగుదొడ్డి నిర్మాణం, రంగులు వేయడం తదితర పనులు చేపట్టారు. ఈ సందర్భంగా దాతలను, విద్యాభివృద్ధి కమిటీ సభ్యులను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారి మత్తి రాంబాబు, నందిగం స్వామి, చలసాని వెంకటేశ్వరరావు, వీరమాచినేని నాగయ్య, మాకినేని శ్రీనివాసరావు, నక్కా బాబు, ఉపాధ్యాయులు, విద్యాభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చైర్మన్‌గా తొలి అడుగు.. అభయాంజనేయుని ఆశీస్సులు





**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వి.జి.టి. ఉడా మాజీ చైర్మన్ డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు మంగళవారం హనుమాన్ జంక్షన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో దాసరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. విజయవాడలో జరగనున్న బోర్డు సమావేశానికి వెళ్తూ దాసరి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దాసరి అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మిల్క్ సొసైటీ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. విజయా డైరీ మాజీ చైర్మన్ చలసాని ఆంజనేయులు దాసరి మెడలో నిలువెత్తు పూలదండ వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కొమ్మారెడ్డి రాజేష్, వీరమాచినేని సత్యప్రసాద్, లయన్ అట్లూరి శ్రీనివాస్, వేములపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి సాయి కళ్యాణి, వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమాప్రసాద్, తుమ్మల బ్రహ్మాజీ, వీరం రాంబాబు, అన్నే చైతన్య, వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవీదేవి, పుసులూరి నాగమణి, పుట్టా సురేష్, అల్లంశెట్టి శ్రీనివాసరావు, చలసాని శ్రీనివాసరావు, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, వీరమాచినేని బుజ్జి, కలపాల శ్రీధర్, యజ్ఞవరపు గణపతి, దన్నె దుర్గారావు, బోయపాటి ప్రసాద్, చింతల వెంకట శివ అప్పారావు, లింగం శ్రీధర్, లంక రమేష్, అన్నే కళ్యాణ్, అల్లంశెట్టి శ్రీమన్నారాయణ, మొవ్వ బుజ్జి, గొట్టాపు వాసుదేవరావు, జాస్తి భూపతి, గరికపాటి ఉమామహేశ్వరరావు, మజ్జిగ నాగరాజు, మొవ్వ రామారావు తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, సూపర్వైజర్లు, సిబ్బంది కూడా హాజరయ్యారు.

# తొలి విడత పింఛన్ దరఖాస్తుల వెల్లువ




**విస్సన్నపేట,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ పరిధిలో తొలి విడత 20 28 పింఛన్ దరఖాస్తులు గ్రామ గ్రామాన సచివాలయాల పరిధిలో ఆన్లైన్ చేసుకున్నట్లు ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు తెలియజేశారు. వికలాంగ వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళ చేనేత గీత మత్స్య, చర్మకారులు, తదితరులు పింఛన్ దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

## ఘనంగా నాయినేని చంద్రకాంతరావు జన్మదిన వేడుకలు.



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ):**వివేక నంద నగర్ డివిజన్ యువ నాయకుడు టైగర్ ఎన్ చంద్రకాంతరావు కి జన్మదిన సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి చంద్రకాంత్ కి శాలువా తో సన్మానం చేసి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జె పురంధర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రకాంతరావు ఇలాంటి జన్మదిన వేడుకలు 100 వసంతాలు జరుపుకోవాలని దీవిస్తూ ప్రజలలో ఎల్లవేళలా ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తూ ఉండాలని వారికి భగవంతుడు అష్ట ఐశ్వర్యాలు ఆరోగ్యంతో ఉండాలని ఎల్లప్పుడూ ప్రజలతో కలిసిమెలిసి చిరునవ్వుతూ అందరితో కలిసి మెలసి ఉండాలని రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనస్పూర్తిగా అభినందనలు తెలిపారు .ఈ కార్యక్రమంలో శ్రీధర్,సూర్యనారాయణ,నాని, సంజీవరెడ్డి,తదితరులు పాల్గొని వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### టి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం ప్రవీణ్ కుమార్ ఫిర్యాదుతో దమ్మాయిగూడ ఎక్సలెన్సియా కళాశాల సీజ్





**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ)**అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న దమ్మాయిగూడ ఎక్సెల్సియా జూనియర్ కళాశాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఈవో సీజ్ చేశారు.తెలంగాణ స్టూడెంట్స్ యూనిట్ (టి ఎస్ యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కళాశాల ఇంటర్ బోర్డు అనుమతి లేకుండా, ఫోర్జరీ ఎన్ ఓ సి పత్రాలతో నడుస్తుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది.కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, కళాశాల అక్రమ ఫైర్ ఎన్ఓసీ లు సమర్పించినట్లు నిర్ధారించి, కళాశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసి రూ. 8 లక్షల జరిమానా విధించారు. అడ్మిషన్లు నిలిపివేయాలని, కళాశాలను నడపవద్దని ఆదేశించినా యాజమాన్యం బేఖాతరు చేసింది.దీంతో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని సీజ్ చేయాలని, విద్యార్థులను ఇతర గుర్తింపు పొందిన కళాశాలల్లో చేర్పించాలని మళ్లీ కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వగా, నేడు డిఈఓ స్వయంగా సందర్శించి కళాశాలను బంద్ చేసి సీజ్ చేశారు.ఈ కార్యక్రమంలో టి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి ఇ. ప్రశాంత్, జే.రాజు, ఎస్. శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న అంగన్వాడీ కేంద్రాలు.

**105 అంగన్వాడీ కేంద్రాలకు సొంత నిధులతో ప్రెషర్ కుకర్లు అందచేసిన ఎమ్మెల్యే గాంధీ.**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 105 అంగన్‌వాడీ కేంద్రాలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తన సొంత నిధులతో సమకూర్చిన ప్రెషర్ కుక్కర్లను మంగళవారం పంపిణీ చేశారు.మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి అంగన్‌వాడీ టీచర్లకు కుక్కర్లు అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని తెలిపారు.అంగన్‌వాడీ నిర్వాహకులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో సొంత నిధులతో కుక్కర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీటితో సమయం, శ్రమ ఆదా కావడంతోపాటు చిన్నారులకు పౌష్టికాహారం సిద్ధం చేయడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం,ప్రీ–స్కూల్ విద్య, ఆరోగ్య సేవలు అందుతున్నాయని తెలిపారు.ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఖర్చు చేయకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు.అంగన్‌వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌లో ప్రత్యేక శిక్షణ అందించినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, శ్రీలత, ప్రతిభ, అనురాధ, లవకుమారి, నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.





కీసర సర్కిల్ జవహర్ నగర్ లో పాలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్. **జవహర్ నగర్, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ)**

# వరంగల్ విమానాశ్రయానికి పి.వి. నరసింహారావు పేరు పెట్టాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు విజ్ఞప్తి
- దేశానికి విశిష్ట సేవలందించిన భారతరత్నకు సముచిత గౌరవం దక్కాలని స్పష్టీకరణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 22, (వార్తాప్రభ) :** తెలంగాణ గడ్డపై జన్మించి దేశ ప్రధానమంత్రిగా విశిష్ట సేవలందించిన భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు పేరును వరంగల్ మామునూరు విమానాశ్రయానికి పెట్టాలని గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. దేశ ఆర్థిక సంస్కరణలు, పరిపాలనా దక్షత, విదేశాంగ విధానాల రూపకల్పనలో పి.వి. నరసింహారావు అందించిన సేవలు చిరస్మరణీయమని గోగులపాటి కృష్ణమోహన్ పేర్కొన్నారు. తెలంగాణ నుంచి దేశ అత్యున్నత పదవిని అలంకరించి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మహనీయునికి భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం ఆయన సేవలకు లభించిన అసలైన జాతీయ గౌరవానికి నిదర్శనమని గుర్తుచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా లక్నేపల్లి గ్రామంలో జన్మించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన పి.వి. నరసింహారావు పేరును మామునూరు విమానాశ్రయానికి పెట్టడం ద్వారా ఆయన సేవలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే గౌరవప్రదమైన స్మారకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. వరంగల్ నేల నుంచి జాతీయ స్థాయికి ఎదిగి దేశ ప్రధానిగా సేవలందించిన మహనీయుడి పేరును ఆయన సొంత ప్రాంతంలోని విమానాశ్రయానికి పెట్టడమే అత్యంత సముచితమైన గౌరవమని స్పష్టం చేశారు. వరంగల్ మామునూరు విమానాశ్రయానికి అధికారికంగా "భారతరత్న పి.వి. నరసింహారావు విమానాశ్రయం, వరంగల్"గా నామకరణం చేయడానికి అవసరమైన చొరవ చూపి, తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయం ద్వారా ఆయన సేవలకు తగిన గుర్తింపు దక్కడంతో పాటు వరంగల్ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం చేకూరుతుందని పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదర భావాన్ని పెంచుతాయి

**-బిజెపి ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,సెప్టెంబరు 22 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ గోపనపల్లి తండాలో ఈదమ్మ పోచమ్మ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు.వినాయకుడి నిమజ్జనం ముగింపు కాదని,కొత్త ఆరంభానికి సంకేతమని పేర్కొన్నారు.విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. శోభాయాత్రలో మహిళలు,చిన్నారులు, యువత, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన ఫలితాలు- డాక్టర్ తపస్వి కృష్ణ




**గుడివాడ:- సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఊపిరితిత్తుల వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన ఫలితాలని యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ అన్నారు. గుడివాడలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక దగ్గు, శ్వాస ఇబ్బంది, ఛాతీ నొప్పి, దగ్గులో రక్తం, బరువు తగ్గడం లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు రోబోటిక్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతో తక్కువ నొప్పి, వేగవంతమైన రికవరీ సాధ్యమన్నారు. క్యాన్సర్ దశ, బయోమార్కర్లు, జన్యు మార్పుల ఆధారంగా టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ వంటి వ్యక్తిగత చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బ్రాంకోస్కోపీ, EBUS-TBNA వంటి ఆధునిక పరీక్షలతో కచ్చితమైన నిర్ధారణ సాధ్యమన్నారు. తరచూ ఇన్ఫెక్షన్లు వస్తున్న వారు సమగ్ర పల్మనరీ మూల్యాంకనం చేయించుకోవాలన్నారు. చివరి దశ ఐపీఎఫ్, సిఓపిడి, ఐ.ఎల్.డి , పల్మనరీ హైపర్‌టెన్షన్ రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక అవకాశమన్నారు. డోనర్ లంగ్స్ పనితీరును ఈ.వి.ఎల్. పి.వి. విధానంతో శరీరం వెలుపల పరీక్షించవచ్చన్నారు. రోబోటిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్‌పై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయని, ఇంకా పరిమిత కేంద్రాల్లోనే జరుగుతోందన్నారు. తీవ్ర శ్వాసకోశ వైఫల్యంలో ఎక్మో తాత్కాలిక సహాయంగా, bridge-to-transplant గా ఉపయోగపడుతుందన్నారు. ధూమపానం, వాయు కాలుష్యం, వృత్తిపరమైన దుమ్ముకు దూరంగా ఉండాలని సూచించారు. చికిత్స ఎంపిక రోగి పరిస్థితి, పరీక్షల ఆధార ంగా నిపుణుల బృందం నిర్ణయిస్తుందన్నా. సమావేశంలో ఏపీ మార్కెటింగ్ హెడ్ వీరంకి వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా మేనేజర్ ఆర్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తపాలా సేవల ఫిర్యాదుల పరిష్కారానికి డాక్ అదాలత్

**విజయవాడ(పి ఐ బి), సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తపాలా కార్యాలయాల్లో అందిస్తున్న సేవలకు సంబంధించిన ఫిర్యాదులతో పాటు ఇతర ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.పి. శ్రీదేవి తెలిపారు. సెప్టెంబర్ 23న విజయవాడలోని సర్కిల్ కార్యాలయంలో ఈ డాక్ అదాలత్ నిర్వహించను న్నారు.తపాలా శాఖ సేవలకు సంబంధించి తమకు ఎదురవుతున్న సమస్యలు, ఫిర్యాదులను ప్రజలు డాక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంది. ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిర్యాదులు), చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ--520013 చిరునామాకు పోస్టు ద్వారా పంపాలి. ఫిర్యాదులు సెప్టెంబర్ 22 లేదా అంతకు ముందు కార్యాలయానికి చేరేలా పంపాలని తపాలా శాఖ అధికారులు సూచించారు.ఫిర్యాదు పంపే పోస్టల్ కవర్‌పై "డాక్ అదాలత్" అని స్పష్టంగా పెద్ద అక్షరాలతో రాయాలని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా వివరించి పరిష్కారం కోరేందుకు సెప్టెంబర్ 23న ఉదయం 11 గంటలకు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ--13లో జరిగే డాక్ అదాలత్‌కు హాజరుకావచ్చు.అదేవిధంగా, ఫిర్యాదుదారుల సౌకర్యార్థం డాక్ అదాలత్‌లో వర్చువల్‌గా పాల్గొనే అవకాశాన్ని కూడా కల్పించారు. సెప్టెంబర్ 23న ఉదయం 11 గంటల నుంచి గూగుల్ మీట్ ద్వారా డాక్ అదాలత్‌లో పాల్గొనవచ్చు. ఇందుకోసం శాఖ అందించిన గూగుల్ మీట్ లింక్‌ను వినియోగించుకోవచ్చు.డాక్ అదాలత్‌లో ఫిర్యాదును పరిశీలించిన అనంతరం, సంబంధిత ఫిర్యాదు లేదా అర్జీ పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారునికి లేఖ లేదా ఇమెయిల్ ద్వారా తెలియజేస్తామని తపాలా శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తపాలా సేవలకు సంబంధించిన తమ ఫిర్యాదులను శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# రాష్ట్ర ఉపాధ్యాయులకు ఐ ఆర్ ప్రకటించాలి

**సిపిఎస్ ఉద్యోగుల కు డి.ఎ. అరియర్ బకాయిలను జమ చేయండి**

**- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన రాష్ట్ర పి ఆర్ టీ యు మాజీ అధ్యక్షులు గడ్డం నారాయణరావు**




**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 22( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలంలో పి.ఆర్.టి.యు సభ్యత్వ నమోదు కార్యక్రమం శనగపాడు,కొల్లికుళ్ళ,పెనుగంచిప్రోలు,ముండ్లపాడు,కొనకంచి తదితర గ్రామాలలోని ప్రాథమిక,ఉన్నత పాఠశాలల యందు నిర్వహించడం జరిగినది.ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పి.ఆర్.టి.యు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడ్డం.నారాయణరావు మాట్లాడుతూ,రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐ.ఆర్ ప్రకటించాలని, సి.పి.యస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు డి.ఎ అరియర్ బకాయిలను తక్షణమే, వారి ఖాతాల యందు జమచేయాలనీ, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు రాష్ట్ర మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆవుల.రాంబాబు ,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్.నవాబ్ జానీ,పి.ఆర్.టి.యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మర్రి.ప్రభాకర్,పి. ఆర్.టి.యు నాయకులు పచ్చల.సునీల్ కుమార్ ,చాట్ల.నిరంజన్, కోతాటి.నరేష్ ,సిహెచ్ .బ్రహ్మయ్య, ఇస్లావత్.పుల్లయ్య,షేక్.కరీముల్లా ,షేక్.ఆదం షఫీ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చండి సారూ అంటూ అఖిలపక్షం నిరసన





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 22వ డివిజన్ కొత్తగూడెం కార్పొరేషన్ సుజాతనగర్ కార్యాలయం మినరల్ వాటర్ నిర్పియోగంగా ఉండడంతో తాగునీటి సమస్య తీర్చండి సారూ అంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం కార్యాలయం ముందు నిరసన చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుజాతనగర్ గ్రామంలో పూర్తిస్థాయిలో మినరల్ వాటర్ నుండి చాలా రోజుల నుండి రావడం లేదని వాపోయారు. సిరిపురం కేశవాపురం గొల్లగూడెం అర్జునవాడ ప్రజలు నిత్యం ఈ నీరే తాగుతున్నారని నగరపాలక అధికారులకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవట్లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి నీటి సరఫరా లేకపోవడంతో విషయాన్ని అధికారుల దృష్టికి వెళ్లాలని కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు ఎండలు మండుతుండడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని సుజాతనగర్ నగరపాలక అధికారి మేనేజర్ సత్యనారాయణ కు విన్నవించారు. వెంటనే స్పందించిన అధికారి టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని మినరల్ వాటర్ ప్రజలకు అందిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బొడ్డు కేశవరావు పలివేల ప్రభు చిట్లూరి కిషోర్ అన్నవరపు పూర్ణయ్య పెద్దమల్ల నాగేశ్వరరావు ఉబ్బనపల్లి శ్రీను బుర్ర నాగేందర్ తదితరులు పాల్గొన్నారు

## జై భవానీ యువ సమితి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్, కంటి పరీక్షల చెకప్ క్యాంప్ నిర్వహణ.

**ముఖ్యఅతిథిగా హాజరైన నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి.**





**కీసర, నాగారం, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ):**నాగారం డివిజన్ పరిధిలోని ఓల్డ్ మార్కెట్ రోడ్డులో జై భవానీ యువ సమితి ఆధ్వర్యంలో, మహేష్ కాశపాక ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఉచిత మెడికల్ క్యాంప్ మరియు కంటి పరీక్షలు చెకప్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.ఈ క్యాంపులో అపోలో, శ్రీకర హాస్పిటల్స్‌తో పాటు నియో విజన్ హెల్త్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు మరియు కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, దాసోహం నర్సింహారావు, మామిడి జంగారెడ్డి, అక్కల సురేష్, షేక్ గౌస్, ప్రవీణ్ యాదవ్, రాజు గౌడ్, నుచ్చు భాస్కర్ యాదవ్, పెరబోయిన మహేష్, మమామిడాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మహిళకు సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షల ఎల్వోసీ

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో నిధుల మంజూరు నిమ్స్ ఆసుపత్రిలో రెండు తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సకు భరోసా**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22, (వార్తాప్రభ) :** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌కు చెందిన పోకల సుకన్య వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 1,50,000 ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. పోకల సుకన్య పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో రెండు తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వైద్య సహాయం అందించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యమంత్రి కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం తక్షణమే ఒక లక్షా యాభై వేల రూపాయల ఎల్వోసీని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాధితురాలికి అవసరమైన వైద్య చికిత్సను తక్షణమే ప్రారంభించాలని, శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత బిల్లులను ప్రభుత్వానికి సమర్పించాలని సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు నిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఆపద సమయంలో సకాలంలో స్పందించి వైద్య సాయం అందించేలా కృషి చేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు, ప్రభుత్వానికి సుకన్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సంపాదకీయం

## సీనియర్ నేతలే జగన్ బలం...వదులుకుంటే దెబ్బే ?

వైసీపీ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన సీనియర్ నేతల మీదనే ఆధారపడుతూ రాజకీయాలు చేస్తూ వస్తోంది. ఇప్పటికి మూడు సార్వత్రిక ఎన్నికలను వైసీపీ ఎదుర్కొంది. ఇందులో తొలి రెండు ఎన్నికల్లో వైసీపీ సీనియర్లకే టికెట్లు ఇచ్చింది. 2024 కి వచ్చేసరికి వైసీపీ చేసినన్ని రాజకీయ ప్రయోగాలు మరే పార్టీ ఇప్పటిదాకా చేసి ఉండదు, ఇక మీదట చేయదు అన్నట్లుగానే సాగింది. దీని వల్లనే 151 సీట్ల నుంచి 11 సీట్లకు వైసీపీ దిగజారింది అన్న విశ్లేషణలు ఉన్నాయి. అయితే గతంలో తప్పులు మళ్లీ వైసీపీ చేయవద్దు అని ఆ పార్టీకి వ్యూహకర్తలు సూచిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఏకంగా వంద దాకా సీట్లలో వైసీపీ 2024 ఎన్నికల్లో భారీ మార్పులు చేసింది. దాంతో తమకు రాజకీయంగా పట్టున్న చోటు నుంచి సీనియర్లు వేరే చోట్లకు చివరి నిముషంలో వెళ్లాల్సి వచ్చింది. అక్కడే పార్టీకి తొలి దెబ్బ పడింది అని అంటున్నారు. అంతే కాదు కొందరు సీనియర్ నేతల వారసులకు టికెట్లు ఇచ్చి పోటీ చేయించింది. దాంతో ఆయా చోట్ల కూటమి నుంచి బలమైన నేతలు దిగి చాలా ఈజీగా వీరిని ఓడించేశారు. జనంలోనూ ఈ పోలిక వల్ల వైసీపీ నష్టపోయింది అని అంటున్నారు. దాంతో 2029 ఎన్నికల్లో కూడా ఇదే విధమైన వైఖరితో ప్రయోగాలు చేస్తే వైసీపీ దారుణంగా నష్టపోతుందని ఆ పార్టీ కొత్తగా నియమించుకున్న ఎన్నికల వ్యూహకర్త కపిల్ సాహు బృందం స్పష్టం చేసింది అని అంటున్నారు. ఇంతకీ ఎన్నికల వ్యూహకర్త కపిల్ సాహుకి ప్రాముఖ్యత ఏంటి అంటే ఈ ఏడాది మేలో జరిగిన తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీని అధికారంలోకి తెచ్చి విజయ్ ని సీఎం గా చేయడంతో సాహు బృందం కీలక పాత్ర పోషించింది అని అంటున్నారు. ఈ బృందం వ్యూహాలు అన్నీ అక్కడ చక్కగా పనిచేసి విజయ్ కి సీఎం పీఠాన్ని దక్కించాయని అంటున్నారు దాంతో ఏరి కోరి మరీ వైసీపీ ఈ మధ్యనే తమ పార్టీకి ఎన్నికల వ్యూహకర్త కపిల్ సాహు బృందాన్ని నియమించింది అని అంటున్నారు. దాంతో వెంటనే రంగంలోకి దిగిన ఈ బృందం వైసీపీ పరిస్థితి క్షేత్ర స్థాయిలో ఎలా ఉందో ఒక నివేదికను తయారు చేసి అందించింది అని చెబుతున్నారు. ముఖ్యంగా రీజనల్ వైజ్ గా అయిదు జిల్లాలను పట్టుకుని ఈ బృందం గ్రౌండ్ లెవెల్ లో వర్క్ చేసి నివేదికను రెడీ చేసింది అని చెబుతున్నారు. అందులో ఉత్తరాంధ్రాలో రెండు జిల్లాలు, రాయలసీమలో మరో రెండింటితో పాటు కోస్తాలో ఒక జిల్లా ఉందని అంటున్నారు వైసీపీ ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లలో ఇంచార్జిలను నియమించింది. అయితే వీరిలో స్ట్రాంగ్ గా ఎంత మంది ఉన్నారు, పని తీరు ఎలా ఉంది అన్నది పార్టీ ఈ బృందం నుంచి నివేదిక కోరినట్లుగా చెబుతున్నారు. వైసీపీకి క్షేత్ర స్థాయిలో గ్రాఫ్ ఎలా ఉంది, ప్రజల నుంచి వస్తున్న స్పందన, అలాగే వచ్చే ఎన్నికల్లో ఎవరిని పోటీకి దించితే ఫలితాలు సరిగ్గా వస్తాయి అన్నది కూడా ఈ బృందం పూర్తిగా అధ్యయనం చేసి మరీ నివేదిక తయారు చేసింది అని అంటున్నారు. దాని ప్రకారం 2024 ఎన్నికల్లో రాజకీయ బదిలీల పేరుతో చేసిన అతి పెద్ద మార్పులను ఇపుడు సరి చేసుకోవాలని సూచించినట్లుగా చెబుతున్నారు. అంతే కాదు వారికి తమ సొంత నియోజకవర్గం అప్పగిస్తే తిరిగి వారు రాణిస్తారు అని నివేదికలో వెల్లడించినట్లుగా పేర్కొంటున్నారు. రాజకీయంగా చూస్తే వైసీపీలో సీనియర్లకు నెట్ వర్క్ బలంగా తమ సొంత ఇలాకాల్లో ఉంది అని అంటున్నారు. వారిని కదిపినా లేదా కొత్త వారిని తెచ్చి టికెట్లు ఇచ్చినా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటాయన్నదే నివేదిక సారాంశంగా చెబుతున్నారు. : వైసీపీ 2029లో ప్రయోగాలు చేయకుండా సీనియర్లకే టికెట్లు ఇస్తేనే మేలు చేకూరుతుందని ఈ నివేదిక తెలియచేస్తోంది అని అంటున్నారు. అయితే వైసీపీలో చాలా మంది సీనియర్లు తమ వారసులను ముందు పెడుతున్నారు. వారిని కనుక దించితే అంత పట్టు సాధించకపోగా చేదు ఫలితాలు వస్తాయని నివేదిక చెబుతోంది అంటున్నారు. దీంతో తొందరలోనే వైసీపీ అధినాయకత్వం సీనియర్లతో కీలక సమావేశాలు నిర్వహించడమే కాకుండా వారికి మరిన్ని బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. మరి సీనియర్ నేతలు కొంతమంది పోటీకి విముఖంగా ఉన్నారు, మరి కొన్ని చోట్ల జూనియర్లకు పగ్గాలు అందాయి. వాటిని ఎలా సరిచేసుకుంటారో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

## స్వచ్ఛతా హి సేవ లో భాగంగా పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పాఠశాల విద్యార్థులకు పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ ఆధ్వర్యంలో బెంజ్ సర్కిల్ వద్ద ఉన్న పింక్ టాయిలెట్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పింక్ టాయిలెట్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్న వివిధ సౌకర్యాలు, సేవలను విద్యార్థులకు వివరించారు. పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ టాయిలెట్లను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవడంతో పాటు వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. టాయిలెట్లను ఉపయోగించిన అనంతరం పరిసరాలను అపరిశుభ్రంగా చేయకుండా, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని సూచించారు. పరిశుభ్రమైన మరుగుదొడ్ల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో ముఖ్యమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు పరిసర ప్రాంత ప్రజలకు కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రత పట్ల బాధ్యతను మరింత పెంపొందించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.

## ప్రజల దృష్టిని మళ్లించడానికి ఉపాధ్యాయులపై దౌర్జన్యం వైసీపీ నీచ రాజకీయం!




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22:(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడలో సోమవారం ఉపాధ్యాయులపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుగుదేశం పార్టీ విజయవాడ పశ్చిమ కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ నమ్మి భాను ప్రకాష్ యాదవ్ అన్నారు. చిట్టినగర్‌లోని తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన ఆదేశాలతోనే ప్రజల దృష్టిని ఇతర అంశాల నుంచి మళ్లించేందుకు ఉపాధ్యాయులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో చర్చ జరుగుతున్న అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు విద్యా రంగంలో కూడా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పారదర్శకంగా వ్యవహరిస్తూ సుమారు 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారని ఆయన అన్నారు. ఇదే సమయంలో గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో ప్రధాన చర్చగా ఉన్న లిక్కర్ స్కాం వ్యవహారంలో అప్పటి ఏ పీ ఎస్ బీ సీ ఎల్ అధికారి ఈ. సత్యప్రసాద్ అప్రూవర్‌గా మారి ఇచ్చినట్లు వార్తల్లో వచ్చిన వాంగ్మూలం కూడా చర్చనీయాంశంగా మారిందన్నారు. ఆ వాంగ్మూలంలో ముడుపుల వ్యవహారాలు తాడేపల్లిలో జరిగినట్లు పేర్కొన్నారని వచ్చిన వార్తల నేపథ్యంలో, ప్రజల దృష్టిని ఆ అంశం నుంచి మళ్లించేందుకే ఉపాధ్యాయులపై దాడి జరిగిందని ఆయన ఆరోపించారు. "అవినీతి జరిగిందని ఆరోపణలు ఉంటే ఆధారాలతో న్యాయస్థానాలను ఆశ్రయించాలి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగ చర్చకు సిద్ధమని పలుమార్లు సవాల్ చేసినప్పటికీ, దానికి స్పందించకుండా ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం సరైన విధానం కాదు. ఇలాంటి ఘటనలు వైసీపీ రాజకీయ వైఖరికి నిదర్శనం" అని నమ్మి భాను ప్రకాష్ యాదవ్ అన్నారు. విజయవాడలో జరిగిన ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పాల ధరల పెంపుపై భగ్గుమన్న సీపీఎం

- విజయా డెయిరీ గేటు తోసుకుని ప్రాంగణంలోకి.. చైర్మన్ బాధ్యతల రోజే నిరసన సెగ
- ధరలు తగ్గించకుంటే పోరాటం ఉధృతం చేస్తాం : సీహెచ్ బాబురావు






**విజయవాడ: సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సామాన్యుడి నిత్యావసరమైన పాలపై మరోసారి ధరల భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నేతలు విజయా డెయిరీ వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. లీటరుకు రూ.2 చొప్పున పెంచిన పాల ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డెయిరీ మెయిన్‌గేట్ వద్ద నిరసనకు దిగారు. విజయా డెయిరీ నూతన చైర్మన్‌గా దాసరి బాలవర్ధన్‌రావు బాధ్యతలు స్వీకరించిన రోజే ఈ నిరసన జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. పెంచిన ధరలపై వినతిపత్రం అందజేసేందుకు డెయిరీ వద్దకు చేరుకున్న సీపీఎం నాయకులను సెక్యూరిటీ, పోలీసు సిబ్బంది అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సీపీఎం నాయకులు మెయిన్‌గేట్‌ను తోసుకుని డెయిరీ ప్రాంగణంలోకి వెళ్లి నిరసన తెలిపారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న విజయా డెయిరీ ఎండీ కొల్లి ఈశ్వరబాబు నాయకులతో మాట్లాడి వారి వినతిని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీపీఎం నాయకులు చైర్మన్ దాసరి బాలవర్ధన్‌రావును కలిసి వినతిపత్రం అందజేసి పెంచిన పాల ధరలను తక్షణమే రద్దు చేయాలని కోరారు.

**ఐదు నెలలు కూడా పూర్తికాకముందే మళ్లీ ధరల పెంపా?...** సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రతి కుటుంబానికి నిత్యావసరమైన పాల ధరలను మళ్లీ పెంచడం ప్రజలపై అదనపు భారం మోపడమేనని విమర్శించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, రోగులు నిత్యం పాలపై ఆధారపడుతున్నారని, ఇలాంటి నిత్యావసర వస్తువుపై స్వల్ప వ్యవధిలోనే పదేపదే ధరలు పెంచడం సమర్థనీయం కాదని అన్నారు. ఏడాదిలో మూడోసారి ధరల పెంపు వల్ల వినియోగదారులపై సుమారు రూ.200 కోట్ల అదనపు భారం పడుతోందని సీపీఎం నేతలు ఆరోపించారు.

**విజయా డెయిరీని బలోపేతం చేయాలి.. వినియోగదారులపై భారం మోపొద్దు...** సహకార రంగంలోని విజయా డెయిరీని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం.. ధరల పెంపుతో వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను అనుసరించకూడదని సీపీఎం నేతలు అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే వినియోగదారులకు అందుబాటు ధరలో పాలు అందేలా విధానాలు రూపొందించాలని కోరారు. ప్రైవేటు డెయిరీలకు ప్రయోజనం చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోకుండా విజయా డెయిరీకి ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహకారం, సబ్సిడీ అందించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

**బోర్డు సమావేశంలోనే ధరల పెంపు రద్దు చేయాలి...** కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ దాసరి బాలవర్ధన్‌రావు ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాలని సీపీఎం నేతలు కోరారు. రానున్న బోర్డు సమావేశంలోనే పాల ధరల పెంపును పునఃసమీక్షించి రద్దు చేసే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించాలి...** కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పాల ధరల పెంపుపై ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమని సీపీఎం నేతలు విమర్శించారు. ప్రజలపై భారం పడుతున్నప్పుడు ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ధరలు తగ్గించకుంటే ఉద్యమం ఉధృతం..** పెంచిన విజయా డెయిరీ పాల ధరలను తక్షణమే ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీహెచ్ బాబురావు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను విస్తృతం చేస్తామని, పాల ధరల పెంపును ప్రజా సమస్యగా తీసుకుని మరింత బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ కార్పొరేటర్లు బోయి సత్యబాబు, గాదే ఆదిలక్ష్మి, ఐద్వా మహిళా నాయకులు, సీపీఎం సెంట్రల్, ఈస్ట్ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ను ప్రారంభించిన నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** నిత్యం విధులు నిర్వహిస్తూ పని వత్తిడిలో పడి తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యానికి గురిఅగుట వలన, వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తిన నిరంతరం ఉద్యోగంలో కష్టపడుతన్న పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరంగా మెరుగుపడి విధినిర్వహణ సమర్ధవంతంగా చేయు నిమిత్తం మరియు ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలోని సిబ్బంది సంక్షేమం దృష్ట్యా ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ మరియు ఆంధ్ర హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేశారు. ఈ నేపధ్యంలో మంగళవారం ఏ. ఆర్. గ్రౌండ్ లోని మెడికేర్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల క్యాంపు ను పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. చేతులు మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రత్యేక శిబిరం నందు బీ పీ ఁ (రక్తపోటు ఁ చక్కెర పరీక్షలు), కే యు బీ స్కాన్ (మూత్రపిండాలు, మూత్రనాళాలు, మూత్రాశయం స్కాన్), ఆడియోమెట్రీ (వినే శక్తి పరీక్ష), పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, బోన్ మినరల్ డెన్సిటీ, డెంటల్ స్క్రీనింగ్, ఆప్తమాలజీ , కార్డియాలజీ కన్సల్టేషన్, 2 డి ఎకో మరియు జనరల్ మెడిసిన్ కన్సల్టేషన్ మొదలైన పరీక్షలను చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ తిరుపతి రావు, డాక్టర్ రఘు రామ్ మరియు జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ రవి కుమార్ లతో పాటు పలువురు అనుభవజ్ఞులైన వైద్యుల బృందం పాల్గొని సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు .ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.... ప్రజా రక్షణలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు అంధరూ కూడా మెడికల్ చెకప్ చేసుకోవాలని ఈ వైద్యపరీక్షలలో ఏమైనా హెల్త్ ప్రాబ్లమ్స్ ఉంటే వాటిని క్లియర్ చేసుకుని ఆరోగ్యంగా విధులకు హాజరవ్వాలని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం సిబ్బందికి జరుగుతున్న వైద్య పరీక్షల పనితీరును స్వయంగా పరిశీలించి అధికారులతో మాట్లాడి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు సక్రమంగా జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, డి.సి.పి. అడ్మిన్ శ్రీమతి కె.జి.వి.సరిత , ఏ. ఆర్. డి. సి. పి. సత్యనారాయణ , హోంగార్డు కమాండెంట్ టి. ఆనంద బాబు , ఏ.ఆర్.ఏ.డి.సి.పి. ఎన్. వి. రమణ , ఏ.సి.పి.లు ప్రేమ కుమార్, కృష్ణం రాజు , చిరంజీవి , ఆర్. ఐ. లు శ్రీనివాస్ , సుధాకర రెడ్డి, శ్రీకాంత్ , పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏం. సోమయ్య, చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ తిరుపతి రావు , డాక్టర్ రఘు రామ్, డాక్టర్ రవి కుమార్ , పలువురు అనుభవజ్ఞులైన వైద్యుల బృందం మరియు పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులపై వైసీపీ నేతల దాడి హేయమైన చర్య

**ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఆగ్రహం**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉన్న శాప్ కార్యాలయంలో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహిస్తుండగా వారిపై సోమవారం వైసీపీ నేతలు ముకుమ్మడిగా దాడికి దిగడం హేయమైన చర్య అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ తీవ్రంగా మండిపడ్డారు. విజయవాడలో సోమవారం వైసీపీ నాయకులు సృష్టించిన అలజడలపై మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విజయవాడ నగరంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డీఎస్సీ ద్వారా ప్రభుత్వం 16 వేల మందికి ఉద్యోగాలు ఇస్తుంటే సహించలేక, వారిపై ఆరోపణలు చేస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తున్నారని విమర్శించారు. డీఎస్సీపై కొంతమంది వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను టీడీపీ నాయకులు విలేకరుల సమావేశాలు పెట్టి నిజాలు ప్రజలకు తెలియాలని చెప్తున్నా తమ వైఖరి మార్చుకోకుండా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిని ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. వైసీపీ నేతలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తాము చెప్పిన చోటికైనా లేదా వారు కోరిన ప్రదేశానికైనా వచ్చి కూర్చుని సమస్యలను పరిష్కరించుకుందామని డూండి రాకేష్ సవాల్ విసిరారు. తాము చర్చలకు వస్తామంటే భయపడి వెనక్కి వెళ్తూ, మరోవైపు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ఏంటని ఆయన ప్రశ్నించారు.

## ప్రజలకు సకల అష్టఐశ్వర్యం సిద్ధించాలి

**పిఏసిఎస్ చైర్మన్ సాదం శ్రీనాద్,డైరెక్టర్ పొన్నం శేషగిరిరావు, నిర్వాహకుడు రవికుమార్**





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** ప్రజలకు సకల అష్టఐశ్వర్యం సిద్ధించాలని ఘన నాధునికి పూజలు నిర్వహించడం జరిగిందని పిఏసిఎస్ చైర్మన్‌సాదం శ్రీనాద్, డైరెక్టర్ పొన్నం శేషగిరిరావు అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ కండ్రికలో 8వ సంవత్సర శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణపతి మహోత్సవములు ఘనంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి నవరాత్రులు 9వ రోజు మంగళవారం శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ నిర్వాహకుడు కె. రవికుమార్, వరలక్ష్మి దంపతులు, టీమ్ సభ్యులు కలసి గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించారు. శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవములకు పిఏసిఎస్ చైర్మన్ సాదం శ్రీనాద్,డైరెక్టర్ పొన్నం శేషగిరిరావులు ముఖ్య అతిధి లు విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న వితరణ జరిగింది. భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర,తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేంశెట్టి నాగమణి,టి నాగరాజు,సి. జటాధర్,ఇ.హరికృష్ణ రెడ్డి,కె. హర్ష సాయి, కోమరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ గా దాసరి వెంకట బాల వర్ధనరావు ఏకగ్రీవ ఎన్నిక

**అట్టహాసంగా ప్రమాణ స్వీకారం**







**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** కృష్ణా మిల్క్ యూనియన్ నందు మంగళవారం జరిగిన పాలక వర్గ సమావేశములో సమితిఛైర్మన్ ఎన్నికని సింగిల్ అజెండాగా ప్రవేశపెట్టి డా. దాసరి వెంకట బాల వర్ధన రావు ని ఏకగ్రీవంగాఎన్నుకోవడం జరిగినది. ఛైర్మన్ ఎన్నిక అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నూతన ఛైర్మన్డా. దాసరి వెంకట బాల వర్ధన రావు మాట్లాడుతూ తనకు ఛైర్మన్ గా అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారాలోకేష్ కి, జిల్లా మంత్రివర్యులు కొల్లు రవీంద్ర కి, కొలుసు పార్థసారథి కి, జిల్లా నియోజక వర్గ ప్రతినిధులకు, కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియ చేశారు. జిల్లా పాడి రైతు కుటుంబ శ్రేయస్సుకు, వినియోగదారుల ప్రయోజనాలకు, సమితి ఉద్యోగుల శ్రేయస్సుకుపాటుపడతానని అలాగే సమితి దీర్ఘకాల ప్రయోజనాలను కాపాడతానని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఆవిర్భావానికి కృషి చేసిన ఎందరో మహనీయుల స్ఫూర్తిని, మ్యాక్స్ చట్టముతోపాడి రైతుల స్వావలంబన కల్పించిన దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయాలకుభంగం కలగకుండా కృషి చేస్తానని తెలిపారు. ఛైర్మన్ ప్రమాణస్వీకారానికి విశేష సంఖ్యలో పాడి రైతు సంఘాల అధ్యక్షులు, పాడి రైతులు, అభిమానులు,సమితి ఉద్యోగులు హాజరై వారికి అభినందనలు తెలిపారు.

# రూ.140 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

## అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం





**విజయవాడ పశ్చిమసెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, మంగళవారం చిత్తూరు జిల్లా కుప్పంలో హైబ్రిడ్ అన్ యువర్ టీ మోడల్ ద్వారా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బోండా ఉమామహేశ్వరరావు, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ శ్రీ లంకా దినకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**విజయవాడ అభివృద్ధికి రూ.140 కోట్లతో మౌలిక వసతులు** ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే శ్రీ బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.5,500 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం రాష్ట్ర అభివృద్ధిలో కీలక ముందడుగని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ.140 కోట్ల వ్యయంతో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమన్నారు. విజయవాడ, గుంటూరు, అమరావతి ప్రాంతాలను సమతుల్యంగా అభివృద్ధి చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టి విజయవాడ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి నగరాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి** 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ శ్రీ లంకా దినకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కుప్పంలో ముఖ్యమంత్రి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడంతో పాటు, ఆయా నగరాల్లో స్థానిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

**రహదారులు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర పరిధిలో రూ.140 కోట్ల వ్యయంతో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగరంలోని రహదారులు, వీధి దీపాలు, పార్కులు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగర మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రజలకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన నగర వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనులను చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, కె. ప్రభుదాస్, కె. షమ్మీ, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణమూర్తి, సురేఖ, అసిస్టెంట్ కమిషనర్లు ఏ.యు.బి. శర్మ, హెలెన్ ప్రభావతి తదితరులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లి,బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా "సుజనా ఫౌండేషన్" ఉచిత వైద్య సేవలు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి )**పశ్చిమ నియోజకవర్గంలోని తల్లి, బిడ్డల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి "సుజనా ఫౌండేషన్" ఆధ్వర్యంలో గర్భిణీల కోసం ఏర్పాటుచేసిన ఉచిత మొబైల్ 2డి ఎకో హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులకు విశేష స్పందన లభిస్తోందిహెచ్ బీ కాలనీ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన ఈ ఉచిత హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులను గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఉచిత హెల్త్ స్క్రీనింగ్ ల ద్వారా మహిళలో గర్భధారణ సమయంలో వచ్చే గుండె జబ్బులు ముందుగానే గుర్తించి ప్రాణాంతక సమస్యలను నివారించడం సాధ్యమవుతుంది పేద, మధ్య తరగతి మహిళలు , గర్భిణీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఎటువంటి ఖర్చు లేకుండా అత్యాధునిక డయాగ్నస్టిక్ సేవలను "సుజనా ఫౌండేషన్" ఉచితంగా అందిస్తుంది మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ శిబిరంలో 29 మంది గర్భిణీలకు 2డీ ఎకో మాటర్నల్ కార్డియాక్ రిస్క్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎన్ వంశీ,2 డీ ఏకో టెక్నీషియన్స్ సుప్రియ , సింధుప్రియ,వైద్య సేవలు అందించి గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు ఈ శిబిరంలో తమ సేవలందించారు.

## 65యూనిట్ల రక్తాన్ని సేకరించిన చేజర్ల బీజేపీ



**చేజెర్ల సెప్టెంబర్ 22 (వార్తాప్రభ)** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్" లో భాగంగా బిజెవైఎం జిల్లా కోశాధికారి కామంచి భద్రయ్య బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తెల్ల ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో చేజెర్ల మండలంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 65 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వావిలేరు గ్రామం యూత్ గ్రీన్కో మేనేజ్మెంట్ త్రికోటేశ్వర విద్యాలయం స్టాఫ్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు సీపారెడ్డి వంశీధర్ రెడ్డి కుంకు బాలయ్య నాయుడు తెల్లబాటి వెంకటరామయ్య ఎస్.వేణు గోపాల్ నాయుడు పాల్గొనగా వారితో పాటు చేజెర్ల సబ్ ఇన్స్పెక్టర్ అయ్యప్ప మండల విద్యా శాఖ అధికారి మస్తానయ్య ఓరుగుంట శివకృష్ణ నలుబోలు మహేష్ కుండా శివారెడ్డి తదితరులు మరియు మండల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమం సాగించారు. చేజెర్ల మండల లింక్ వర్కర్ స్కీం ఆత్మకూరు శశికళ రక్త దాతలను రక్త సేకరణకు ప్రోత్సకించుటకు ప్రధాన పాత్ర వహించడమైనది. ఈ సందర్భంగా మండల నాయకులు కార్యకర్తలు స్వయంగా రక్తదానం చేయడంతో పాటు తమ అభిమానులను కూడా రక్తదానం చేసేందుకు ప్రోత్సహించారు. పెద్ద సంఖ్యలో యువత కార్యకర్తలు నాయకులు పాల్గొని రక్తదానం చేయడంతో శిబిరం విజయవంతమైంది.

# కొండపల్లి అభివృద్ధికి ముఖ్యమంత్రి చేయూత

● రూ.96 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి ● తొలిదశలో రూ.25 కోట్ల పనులకు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన ● 13.5 కి.మీ. సీసీ రోడ్లు, పార్కులు, మున్సిపల్ కార్యాలయ నిర్మాణం ● మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ ఏర్పాటుకు తాను కృషి చేసి పురుడుపోశానని, అయితే గతంలో తగిన స్థాయిలో అభివృద్ధి జరగక నిధుల కొరతతో మున్సిపాలిటీ ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. తొలిదశలో భాగంగా రూ.25 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు వర్చువల్ గా శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీకి వివిధ అభివృద్ధి పథకాల కింద రూ.96 కోట్ల విలువైన పనులు మంజూరు కావడం సంతోషకరమైన విషయమన్నారు. రూ.25 కోట్ల నిధులతో సుమారు 13.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, అలాగే కొండపల్లి మున్సిపాలిటీకి సొంత కార్యాలయ భవనం లేని పరిస్థితిని అధిగమించేలా మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. దశల్లో మరో రూ.25 కోట్లు, రూ.46 కోట్లకు సంబంధించిన ప్రతిపాదనలు చివరి దశలో ఉన్నాయని, సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన అదనపు నిధులు కూడా త్వరలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కొండపల్లి మున్సిపాలిటీకి ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణలకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అక్కల రామ్మోహన్రావు (గాంధీ), మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి నాయకులు జంపాల సీతారామయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాస్టర్ హ్యారీ ఆరోన్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి

### నివాళులర్పించిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 22 :(వార్త ప్రభ ప్రతినిధి)** మహంతి పురానికి చెందిన, ప్రముఖ దైవ జనులు గత 45 సంవత్సరాలుగా అనేక గ్రామాల్లో మరియు పట్టణ ప్రాంతాల్లో సువార్త, సేవలందించి ఎందరికో ఆదర్శంగా నిలిచిన పాస్టర్ మండల హ్యారీ ఆరోన్ మృతి పట్ల పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పాస్టర్ హ్యారీ ఆరోన్ అనారోగ్య సమస్యలతో సోమవారం రాత్రి హఠాన్మరణం చెందారు.. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం తరపున కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ మహంతిపురంలోని వారి నివాసానికి వెళ్లి పాస్టర్ హ్యారీ ఆరోన్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. సంఘానికి సమాజానికి ఆయన చేసిన ఆధ్యాత్మిక సేవలను గుర్తు చేసుకున్నారు. కూటమి నేతలు ఫతావుల్లా, షేక్ ఆషా , పిళ్ళ శ్రీనివాసరావు, పేటేటి రాజా మోహన్, కొప్పుల గంగాధర్, మహమ్మద్ జాహిద్ , గాడ్స్ చర్చ్ ఇన్ క్రిస్ట్ విశ్వాసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాస్టర్ హ్యారీ ఆరోన్ చేసిన సేవలను స్మరించుకొని ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు..

## లయన్స్ చిల్డ్రన్స్ పార్క్‌లో మరమ్మత్తులు....



**గుడ్లవల్లేరు: సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి నిర్వహణలో లయన్స్ చిల్డ్రన్స్ పార్క్‌ను ఆట వస్తువులను గతంలో ఇచ్చి నిర్వహిస్తున్నారు. ఆ ఆట వస్తువులకు మరమ్మత్తులు, పెయింటింగ్‌లను గుడ్లవల్లేరు పీఏసీఎస్ నిధులు రూ15వేలు, ఇతర దాతల సహకారంతో రూ.15వేలతో నిర్వహించడం జరిగింది. ఈ పనులకు సహకరించిన గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ వెనిగళ్ళ నాగేశ్వరరావుతో పాటు ఇతర దాతలకు లయన్స్ చైర్మన్ కల్యాణపు నవాబు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

● డీఎస్సీపై రాజకీయ రాద్ధాంతం తగదు ఏం చేస్తున్న వైకాపా ● అభివృద్ధి కావాలా..? అరాచక శక్తులు కావాలా? ● ప్రజలే ఆలోచించాలి. ● జగన్ పై ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత కృష్ణప్రసాద్ ఫైర్



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ ప్రతినిధి):** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా నీతులు చెబుతున్నారని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న విమర్శలను ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఖండించారు. కొండపల్లిలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ అంశాన్ని రాజకీయ రాద్ధాంతంగా మార్చడం ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రూ.11 వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమవుతున్న సమయంలో డీఎస్సీని అడ్డుపెట్టుకుని రాజకీయ ఆందోళనలు చేయడం వ్యూహాత్మక ప్రయత్నంగా కనిపిస్తోందని వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. డీఎస్సీ ద్వారా 16,500 ఉద్యోగాలు కల్పించామని ప్రభుత్వం చెబుతున్న సమయంలో, వాటిని ఫేక్ ఉద్యోగాలుగా పేర్కొంటూ ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మైలవరం నియోజకవర్గానికి కూడా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు వచ్చాయని, నియామకాల్లో అక్రమాలు జరిగి ఉంటే స్థానికంగా తమకు తెలియకుండా ఎలా ఉంటుందని అన్నారు. మళ్ళీ తాడేపల్లి ప్యాలెస్లో కూర్చొని జగన్మోహనరెడ్డి అల్లర్లపై డీఎస్సిపై రివ్యూ చేసి, తెలుగుదేశం గుండాలు దాడులు చేశారని ఆరోపించారన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటానికి సిగ్గుండాలన్నారు. మీడియాలో వీడియోలు, అన్ని పత్రికల్లోని వార్తల్లో ప్రజలంతా వాస్తవాలన్నీ గమనించారన్నారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, యువత భవిష్యత్తు, ఉద్యోగాలు, సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని గత ఐదేళ్ల పాలనలో ఏం జరిగింది, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏం చేస్తోందో బేరీజు వేసుకోవాలని వసంత కృష్ణ ప్రసాద్ కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉన్న సీబీఐ, ఈడీ కేసులకు, తనపై ఉన్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ఇతరులపై కేసులు, విచారణలు కోరడం రాజకీయంగా బాధ్యతారాహిత్యమని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ విమర్శించారు.

## ఘనంగా జార్జి ఫాదర్ విగ్రహ ఆవిష్కరణ



**విస్సన్నపేట సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక మండల కేంద్రంలో దివంగత జార్జ్ ఫాదర్ (ఆర్.సి.యం చర్చ్) విగ్రహమును మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు విరివిగా పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం...



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 22( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఎలినోవో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడం, నీటి ఎద్దడి గురించి, రాబోయే దాల్వా పంటల సస్య సంరక్షణ చర్యల గురించి ఈ కార్యక్రమంలో చర్చించారు,ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ డి ఏ సి. భవాని , అనిగండ్లపాడు సొసైటీ అధ్యక్షులు అత్తులూరి అచ్యుతరావు, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఏఈ వో అనిగండ్లపాడు గ్రామ వి.ఏ.ఏ. మరియు విహెచ్ఏ లు మరియు అనిగండ్లపాడు గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

# భీమ్ పేమెంట్స్ యాప్ లో మై యూపీఐ ప్రారంభం



**అమరావతి: సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) యొక్క పూర్తి అనుబంధ సంస్థ అయిన ఎన్పీసీఐ భీం సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్బీఎస్ఎల్)భీమ్ పేమెంట్స్ యాప్ లో మై యూపీఐ అనే ఏఐ ఆధారిత సంభాషణ సహాయకాన్ని ప్రారంభించినట్లు నేడు ప్రకటించింది. గ్లోబల్ ఫింటెక్ ఫెస్ట్ 2026లో ఎన్పీసీఐ మై యూపీఐ ని ప్రారంభించింది.

**మై యూపీఐ ద్వారా భీమ్** వినియోగదారులు తమ యూపీఐ అవసరాలకు 24/7 సులభమైన, బహుభాషా సపోర్ట్ పొందవచ్చు. దీంతో డిజిటల్ చెల్లింపులు మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా, సులభంగా నిర్వహించుకునేలా ఉంటాయి. వినియోగదారులు ఇకపై లావాదేవీల చరిత్రను చూడటం, ఫిర్యాదులు నమోదు చేసి వాటి స్థితిని ట్రాక్ చేయడం, ఏ యూపీఐ యాప్ ద్వారా ఏర్పాటు చేసిన మాండేట్లను చూడటం మరియు నిర్వహించడం, మొబైల్ నంబర్‌ను డీ లింక్ చేయడం, యూపీఐ మోసాలపై అవగాహన మరియు సహాయం పొందడం వంటి సేవలను ఒకే చోట ఉపయోగించుకోవచ్చు. వివిధ సపోర్ట్ ఛానళ్లను వెతకాల్సిన అవసరం లేకుండా, అవసరమైన సహాయం పొందడంతో పాటు తగిన చర్యలు తీసుకోవడం మై యూపీఐ ద్వారా సులభమవుతుంది.

**మై యూపీఐ** లో వినియోగదారులు రోజువారీ మాట్లాడే భాషలో తమ అవసరాలను చెప్పవచ్చు. దీంతో వివరమైన ఫారమ్‌లు నింపడం లేదా పదేపదే ప్రశ్నలు, సమాధానాలు చేయాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రస్తుతం మై యూపీఐ ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, బెంగాలీ భాషల్లో అందుబాటులో ఉంది. త్వరలో మరిన్ని ప్రాంతీయ భాషలను కూడా చేర్చనున్నామని ఎన్పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండి లలితా నటరాజ్ తెలిపారు.

## పశ్చిమ ఇబ్రహీంపట్నంలో గార్బీ షరీఫ్ పండుగ



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ ప్రతినిధి):**పశ్చిమ ఇబ్రహీంపట్నం లో ముస్లింలకు ముఖ్యమైన పండుగలో ఒకటైన గార్బీ షరీఫ్ పండుగ ను ఘనంగా నిర్వహించారు. మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో గౌసేపాక్ చిహ్నమైన జెండాను అలంకరించి విధుల వెంట ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ ముతవల్లి ముస్తఫా మాట్లాడుతూ గౌసేపాక్ పేరు మీద పేదలకు అన్నదానం చేయడం గార్బీ షరీఫ్ పండగ ప్రధాన లక్ష్య తెలిపారు. మంగళవారం ఆయన చిహ్నమైన జెండాను ఊరేగిస్తామని, ప్రత్యేక ఫాతేహా ఖానీ నిర్వహిస్తామని తెలిపారు. శనివారం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వి.ఎస్. దివాకర్



**అమలాపురం వార్తా ప్రభ సెప్టెంబర్ 22**ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయం, విజయవాడలో నిర్వహించిన సంఘ ఎన్నికల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వి.ఎస్. దివాకర్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. దివాకర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలియజేసి, సంఘ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి సరళవతి, సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అమలాపురం డివిజన్ అధ్యక్షులు అశోక్ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇబ్రహీం, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సాధనాల ఏలేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది స్వర్ణ, విహారి, సిరి, చిన్నబాబు, ఆదిత్య, వెంకటేశ్వరరావు, రాజేష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల లైసెన్స్ ల రెన్యువల్ కు గడువు పొడిగింపు..



**నూజివీడు, సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు లో మద్యం దుకాణాల లైసెన్సుల రెన్యువల్‌కు ప్రభుత్వం గడువును 23-09-2026 రాత్రి 12.00 గంటల వరకు పొడిగించింది. నూజివీడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 20 మద్యం దుకాణాలకు లైసెన్సులు ఉండగా, ఇప్పటివరకు 19 దుకాణాలకు సంబంధించి లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియ పూర్తయింది. వీటి ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.8.14 కోట్ల ఆదాయం సమకూరింది.ఇంకా ఒక మద్యం దుకాణానికి సంబంధించి లైసెన్స్ రెన్యువల్ చేయాల్సి ఉంది. ప్రభుత్వం పొడిగించిన గడువు 23-09-2026 రాత్రి 12.00 గంటల వరకు మాత్రమే ఉన్నందున, సంబంధిత లైసెన్సుదారులు గడువులోగా రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు

## గురజాడఅప్పారావు జయంతి..



**నూజివీడు, సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు మండలము అన్నవరం జిల్లాపరిష హై స్కూల్ లో గురజాడ అప్పారావు జయంతి ని నిర్వహించామని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర తెలిపారు.గురజాడ అప్పారావు 1862 సెప్టెంబర్ నా జన్మించాడని తెలిపారు. భార్యపేరు వెంకట నరసమ్మ. బిరుదులు అభ్యుదయ కవితాపితామహుడు, కవిశేఖర.గురజాడ అప్పారావు దేశమంటేమట్టి కాదోయె, దేశ మంటే మనిషిలేయ్ అని తెలియచేశారు.తెలుగు ఉపాధ్యాయని మంగలక్ష్మి మాట్లాడుతూ గురుజాడ అప్పారావుకు ముగ్గురు.సంతానమని అని తెలిపారు. తండ్రిపేరు వెంకట రామదాసు తల్లిపేరు కౌసల్యమ్మ.బాల్యవివాహాలు, కన్యా శుల్కం, సాంఘిక దురాచారాలను ఎదురించినగొప్ప సంఘ సంస్కర్త గురుజాడఅప్పారావు అని తెలిపారు.స్టాఫ్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాలాన్ని జయించిన మహామనిషి గురుజాడ అప్పారావు. తెలుగునాటకరంగ చరిత్రలో ప్రథమ ఆధునిక నాటకం కన్యాశుల్కం రచించినవారు. తెలుగు సాహిత్యములో ఆధునిక భావజాలానికి ప్రముఖమార్గదర్శి. సామాజిక సంస్కరణలకోసం తన రచనలద్వారా బలమైన సందేశాన్ని ఇచ్చేవారు. సరళమైన ప్రజలకు అర్థమయ్యే తెలుగుకు ఆయన పెద్దపీట వేశారు. నేటి సమాజానికి ఆయన ఆలోచనలు స్ఫూర్తిదాయకము అని తెలిపారు.వ్యాసరచన పోటీల్లో మోక్షిత ప్రథమ, తేజశ్రీ ద్వితీయ, కిరణ్ తృతీయ. చతుర్థ బహుమతి జో సాయి త్రినాథ్వకృత్వ పోటీల్లో ప్రథమ ఎనోష్, ద్వితీయ ధనలక్ష్మి, తృతీయ భరత్ కుమార్.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బస్ స్టాప్ లో మందు బాబు హాల్ చల్

**చేతిలో మందు గ్లాస్ తో మహిళలతో అసభ్య ప్రవర్తన**

**బస్ స్టాప్ వద్ద వైన్స్ నిర్వహణ పై తీవ్ర విమర్శలు**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 22(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్...రద్దీగా ఉండే కొండపల్లి బస్ స్టాప్.. మైలవరం వైపు వెళ్లే మహిళలు ఇక్కడే బస్సు కోసం వేచి ఉంటారు. పక్కనే వైన్స్.. కం బార్ అనుమతికి ఇచ్చి మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇది. మందుబాబులకు ఇంత సౌకర్యం కలిపిస్తున్న ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు చెప్పాలనుకున్నాడేమో ఒక మందుబాబు ఏకంగా గ్లాస్ తో రోడ్ ఎక్కాడు... విచిత్ర విన్యాసాలు చేస్తూ మహిళలను ఇబ్బందిని గురి చేసాడు.ఒకపక్క స్కూలు పిల్లలు, మహిళలు, సామాన్య ప్రజలు కనీసం బస్సు కోసం నిలబడలేని దౌర్భాగ్యం కల్పించిన ఘనత ఈ ప్రభుత్వాన్ని ది అని మండిపడుతున్నారు. ఆర్భాటలు పలికే ఏ ఒక్క నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం తీవ్ర విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు... దీనిపై కూటమి నేతలైన ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నిస్తున్నారు. కూటమిలో మహిళ నేతలకు ఈ అరాచకాలు కనిపించట్లేదా..? ప్రభుత్వంలో ఉండి కళ్ళు మూసుకున్నారా..? అని ప్రశ్నలు సంధిస్తున్నారు మహిళలు.ఎక్సైంజ్, పోలీస్ వ్యవస్థ కను సన్నల్లో జరుగుతున్న ఈ అరాచకంపై ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# దరఖాస్తు దారులతో కలిసి నాణ్యమైన పరిష్కారానికి కృషి చేస్తున్నాం

### - ఉన్నతాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వెల్లడి



**ఏలూరు, సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అక్టోబర్ నెలలలో జిల్లాలో 38 గ్రామాలలో 27 వేల 114 పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, రెవిన్యూ సమస్యలు, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి మంగళవారం రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ అక్టోబర్ నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, 22ఏ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా నిబంధనల ననుసరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పనులను నిర్దేశించిన లక్ష్యాల మేర పూర్తిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో జిల్లాలో 32 గ్రామాలలో 13 వేల 131 పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేశామని, అక్టోబర్ నెలలలో జిల్లాలో 38 గ్రామాలలో 27 వేల 114 పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 22ఏ భూ సమస్యలపై జూన్, 15వ తేదీ నుండి ఈనెల 21వ తేదీ వరకు 480 దరఖాస్తులు అందగా వాటిలో 210 దరఖాస్తులు పరిష్కరించామని, నిబంధనల మేరకు లేని 193 దరఖాస్తులను కారణాలు తెలియజేస్తూ తిరస్కరించామన్నారు. పెండింగ్ లో ఉన్న 77 దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో ధరఖాస్తుదారుని కలిసి సమస్య తెలుసుకుని నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ ఎం. ముక్కంటి, , నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

# అదనపు పెన్షన్ క్వాంటమ్ పునరుద్ధరణ ఉత్తర్వులు విడుదల పై హర్షం

***ఏపీ జెఎసి చైర్మన్, ఎన్. జి.జి.ఓ. సంఘు రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్***

***గత ప్రభుత్వం తొలగించిన ఎడిషనల్ క్వాంటం పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు***



**విజయవాడ, సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నాలుగు లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూర్చుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను పునరుద్ధరిస్తూ ఆర్థిక శాఖ మంగళవారం జి .ఓ .యం.యస్ .నెం:126 ద్వారా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఎ పి యన్ జి జీ ఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి వి రమణ లు హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రితో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ దరిమిలా ఎపి ఎన్ జి ఓ సంఘ కృషితో 15 రోజుల్లో గానే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పెన్షనర్లలో ఆనందాన్ని నింపింది అని తెలిపారు. దీనివలన నాలుగు లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. పిఆర్సి కమిటీ నియామకం, హెల్త్ కార్డులపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కూడా అతి త్వరలోనే ఉత్తర్వులు వెలుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం తొలగించిన ఎడిషనల్ క్వాంటమును, ఈ ఉత్తర్వుల ద్వారా 70 సంవత్సరాలు పూర్తయిన పెన్షనర్లకు లభించే అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను 7% నుంచి 10%కు, 75 సంవత్సరాలు పూర్తయిన పెన్షనర్లకు 12% నుంచి 15%కు పునరుద్ధరించడం జరిగింది. ఈ పునరుద్ధరణ డిసెంబర్ 2026 నెల పెన్షన్ నుంచి, 01-01-2027న చెల్లించే పెన్షన్‌కు అమల్లోకి రానుంది.పెన్షనర్ల సంక్షేమానికి సంబంధించిన ఈ ముఖ్యమైన అంశంపై ఎ పి యన్ జి జీఓస్ అసోసియేషన్ తరపున నిరంతరం ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లడం, పెన్షనర్ల న్యాయమైన ప్రయోజనాల కోసం సంబంధిత వర్గాలతో సమన్వయం చేస్తూ కృషి చేయడం జరిగిందని ఎ విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా ఎ పి యన్ జి జీఓస్ అసోసియేషన్ ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా పనిచేస్తుందని, న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.పెన్షనర్ల సంఘాల నుంచి వచ్చిన ప్రతినిధిత్వాలను ప్రభుత్వం పరిశీలించి, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుని అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను పాత రేట్లకు పునరుద్ధరించడం అభినందనీయమని తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కు, రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక శాఖ అధికారులకు ఎ పి యన్ జి జీఓస్ అసోసియేషన్ తరఫున ఎ. విద్యాసాగర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవిధంగా ఈ అంశం పరిష్కారం కోసం సంఘం తరఫున నిరంతర కృషి చేయడం జరిగిందని ఎ పి యన్ జి జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి .వి.రమణ తెలిపారు.పెన్షనర్ల సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ మరియు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఎ పి యన్ జి జీఓస్ అసోసియేషన్ తన కృషిని నిరంతరం కొనసాగిస్తుందని, రాష్ట్ర అధ్యక్షులు ఎ విద్యాసాగర్ , మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శ డి వి రమణ తెలిపారు.

# వైభవంగా శ్రీవారి రథోత్సవం

### - గోవిందనామస్మరణతో మారుమోగిన తిరుమాడ వీధులు





**తిరుమల, సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన మంగళవారం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారు మహోన్నత రథంపై తిరుమాడ వీధుల్లో విహరించారు. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని రథాన్ని లాగుతూ స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.రథంపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారు తిరుమాడ వీధుల్లో విహరిస్తుండగా భక్తులు అడుగడుగునా హారతులు సమర్పిస్తూ "గోవిందా.. గోవిందా" అంటూ నామస్మరణ చేశారు. దీంతో తిరుమాడ వీధులు గోవిందనామస్మరణతో మారుమోగాయి. భక్తులు రథానికి కట్టిన తాళ్లను పట్టుకుని ఉత్సాహంగా రథాన్ని ముందుకు లాగారు.రథోత్సవానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం : ఆర్ష సంప్రదాయంలో రథోత్సవానికి విశిష్ట స్థానం ఉంది. పురాణాలు, ఇతిహాసాల్లో రథసంచారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు పేర్కొనబడింది. ప్రసిద్ధ దేవాలయాల్లో ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి ఊరేగించే సంప్రదాయం ఆగమశాస్త్ర సమ్మతంగా కొనసాగుతోంది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అనే ఆర్షవాక్యం రథంపై కొలువుదీరిన శ్రీకేశవుని దర్శనానికి ఉన్న పవిత్రతను తెలియజేస్తుంది.రథోత్సవంలో అంతర్లీనమైన తాత్త్విక సందేశం కూడా ఉంది. కఠోపనిషత్తు ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనస్సును పగ్గాలుగా, ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణిస్తుంది. ఇంద్రియాలను నియంత్రిస్తూ ఆత్మ--అనాత్మ వివేకంతో జీవించాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని రథోత్సవం భక్తులకు గుర్తుచేస్తుంది. సకల జీవుల్లో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన భక్తులను అనుగ్రహిస్తూ తన రథాన్ని తానే నడిపిస్తున్నాడనే భావన ఇందులో అంతర్లీనంగా ఉంది.రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భద్రతా సిబ్బంది, ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ. శరత్, ఎస్వీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, పలువురు బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# డా. ఆర్. అమరేంద్ర కుమార్ కు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు

**-హర్షం వ్యక్తం చేసిన పశుసంవర్ధక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు కృష్ణారావు**



ఆంధ్రప్రదేశ్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. సిహెచ్ ఎస్ . కృష్ణా రావు

**విజయవాడ, సెప్టెంబర్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నం. 325, తేదీ 22-09-2026 ద్వారా ఏపీ షీప్ ఒ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ అమరేంద్ర కుమార్ ను పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా (ఆంధ్రప్రదేశ్, విజయ వాడ) పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించినందుకు ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హృదయపూర్వక స్వాగతం పలికింది.పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ పదవిలో ఖాళీ ఏర్పడిన నేపథ్యంలో, సున్నితమైన పరిపాలన కొనసాగేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సమయోచితం మరియు సముచితమని,డా. ఆర్. అమరేంద్ర కుమార్ గతంలో చేసిన సేవలు, అనుభవం, నిబద్ధత దృష్ట్యా ఈ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించగలరని అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారావు ఆశాభావం వ్యక్తం చేశారు. పశుసంవర్ధక శాఖ అభివృద్ధి, రైతులు, పశుపాలకుల సంక్షేమం మరియు శాఖ సమర్థవంతమైన పనితీరు కోసం ఆయన నాయకత్వంలో మరింత మెరుగైన చర్యలు చేపడతారని, ఆయన డైరెక్టర్ స్థానంలో ఉండటం ద్వారా పశుసంవర్ధక శాఖను అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లి అభివృద్ధి పథంలో నడిపిస్తారని వారు పేర్కొన్నారు. అసోసియేషన్ ఆయనకు పూర్తి సహకారం అందిస్తుందని తెలియజేస్తోంది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, పశుసంవర్ధక శాఖ మరింత బలోపేతం కావాలని అసోసియేషన్ కోరుకుంటోందని ఏ.పీ. ఏ.హెచ్. జీ.వో.ఏ.అధ్యక్షులు కృష్ణా రావు హర్షం వ్యక్తం చేశారు.

## నీటి సరఫరా సమస్యలు పరిష్కరించండి

**- బి.ఆర్.ఎస్. సీనియర్ నాయకులు మారబోయిన రవి కుమార్ వినతి**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లిలోని ఆరంభ్ టౌన్‌షిప్‌లో నెలకొన్న నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారబోయిన రవి యాదవ్ మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ సైబరాబాద్ జనరల్ మేనేజర్ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు.టౌన్‌షిప్‌లో నీటి పీడనం తక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ఎత్తైన ప్రాంతాలకు నీరు సరిగా చేరడం లేదని తెలిపారు.ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొంటూ, సకాలంలో తగిన పీడనంతో నీటి సరఫరా అందించాలని కోరారు.సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జనరల్ మేనేజర్ శ్రీహరి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టౌన్‌షిప్ అసోసియేషన్ సభ్యులు, పలువురు నివాసితులు పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖ సంతోషాలతో, శాంతి, ఐశ్వర్యంతో వర్ధిల్లాలి.

**-యలమంచిలి ఉదయ్ కిరణ్ ప్రత్యేక పూజలు**



**మియాపూర్,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని చిరంజీవి నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు శ్రీ వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు,చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు,శాంతి,ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు.టీమ్ మహాబల యూత్ అసోసియేషన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహేష్,నవీన్, సతీష్,దేవేందర్,గురువులు, రాజేష్ తదితరులతో పాటు కమిటీ సభ్యులు,మహిళలు, యువత, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## నాయినేని చంద్ర కాంత్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెల్ల హరికృష్ణ.



**కూకట్ పల్లి,సెప్టెంబర్22 (వార్తాప్రభ)**వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయినేని చంద్ర కాంత్ రావు జన్మదినం సందర్భంగా కూకట్ పల్లి విశాల్ టవర్స్ ప్రాంగరంలో ఉన్న వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, ఐక్యత యూత్ అసోసియేషన్ సభ్యులు క్రాంతి, విక్రమ్, వినయ్, సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లం మహేష్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగన్వాడీ -2 నందు 9 వ జాతీయ పోషకాహారం మాస ఉత్సవాలు..



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 22 ( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చిల్లకల్లు పరిధిలోని పెనుగంచిప్రోలు గ్రామంలో అంగన్వాడి కేంద్రం 2 నందు 9వ జాతీయ పోషకా హారం మాస ఉత్సవాలు ప్రోగ్రాం సిడిపివో సత్యవతి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీ లు బాలింతలకు 7o2 టూ త్రీ పిల్ల తల్లులను ఆహ్వానించి వాళ్ళ తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పిల్లలు తల్లులు ఆయాలు పాల్గొన్నారు...

## శివపురంలో 40 వ్యవసాయ మోటార్ల కరెంటు వైర్ల చోరీ....



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 22(వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం శివపురం గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన సుమారు 40 మోటార్లకు సంబంధించిన కరెంటు వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు.వైర్ల చోరీతో రైతులకు తీవ్ర ఇబ్బందులుఎదురవుతున్నాయని, మోటార్లకు విద్యుత్ సరఫరా చేసుకునేందుకు మళ్లీ కొత్త వైర్లు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని శివపురం రైతులు కోరుతున్నారు...

## మానవతా సేవకు దాతల చేయూత

-రూ.2.70 లక్షల ఫ్రీజర్ బాక్స్ రవాణా వాహనం వితరణ



**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ శాఖకు రూ. 2,70,000/- విలువైన మృతదేహ శీతలీకరణ బాక్సుల రవాణా వాహనాన్ని దాతలు వితరణగా అందించారు. కొండపల్లి ఉమాశంకరరెడ్డి, వేగి రత్నాజీ, యలవర్తి శివకేశవ కృష్ణారావు, ఉప్పలపాటి మారుతీప్రసాద్, పిన్నమనేని రామచంద్రరావు ఈ వాహనాన్ని అందజేశారు. రాష్ట్ర కన్వీనర్ మారు బోయిన కోటేశ్వరరావు వాహనాన్ని ప్రారంభించి దాతలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ శాఖ వద్ద 5 ఫ్రీజర్ బాక్సులు, ఒక శాంతిరథం ఉన్నాయని, ఇక నుండి ఈ వాహనం ద్వారా ఫ్రీజర్ బాక్స్ అవసరమైన వారికి ఉచితంగా రవాణా చేస్తామని, బాధితులు రవాణా ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు నందమూరి పద్మజ, ఉమ్మడి కృష్ణా జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, గుడివాడ శాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, పర్యావరణ పరిరక్షణ చైర్మన్ దండమూడి జయలక్ష్మి, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కైకలూరులో మోగిన దసరా భేరి - శ్యామలాంబ ఉత్సవాలకు ముహూర్తం ఖరారు



**కైకలూరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఇలవేల్పు శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు శ్రీకారం పలికారు. స్థానిక అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం 9.29 గంటలకు పందిరి రాట మహూర్తాన్ని వైభవంగా నిర్వహించారు. సంబరాల ప్రధానారు కుమారుడు తరుణ్ వర్మ - రేణుక దంపతులచే రాటస్తంభానికి ప్రత్యేక పూజలు చేయించారు. కైకలూరు ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ ప్రముఖులతో కలిసి రాటస్తంభాన్ని ప్రతిష్ఠించి, శరన్నవరాత్రి మహూర్తాన్ని ఖరారు చేశారు.

**అక్టోబర్ 11 నుండి 20 వరకు చండీయాగ సహిత ఉత్సవాలు :** ఈ సందర్భంగా ఆలయ ఈవో యర్రగుడ్ల వాసు మాట్లాడుతూ.. అక్టోబర్ 11 నుండి 20వ తేదీ వరకు పది రోజుల పాటు శ్రీ చండీ మహా యాగ సహిత శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ అమ్మవారు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తారని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, జంపన రామలింగరాజు, ఆలయ చైర్మన్ ముత్యాల సుందర శ్రీనివాస్, కనక లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ లంకపల్లి మోహన్ రావు, ఎంపీపీ అడివి కృష్ణమోహన్, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, వేంపాటి విష్ణురావు, పూల రామచంద్రరావు తదితర కూటమి నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బహుభాషా జాతీయ నాటిక పోటీల్లో "తెలుగు నాటిక" కు పురస్కారం



**శ్రీకాకుళం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** జాతీయస్థాయి బహుభాషా నాటిక పోటీలలో ఏకైక తెలుగు నాటికగా ప్రదర్శితమైన "ద్వారబంధాల చంద్రయ్య నాయుడు" నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచింది. శ్రీకాకుళంలో శ్రీ సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుండి 20 వరకు జరిగిన ఈ పోటీల్లో అస్సామీ, బెంగాలీ, మరాఠీ, మల యాళీ, పంజాబీ, హిందీ నాటికలతో పోటీపడి గుడివాడ కృష్ణా ఆర్ట్స్ ప్రదర్శించిన ఈ నాటిక బహుమతిని కైవసం చేసుకుంది. పి.వి.సత్యనా రాయణ రచన, పెద్దిబోయిన కృష్ణ హితేష్ దర్శకత్వంలో రూపొందిన ఈ నాటికకు బహుభాషా పోటీల్లో బహుమతి రావడం ఇదే తొలిసారి.

**జాతీయస్థాయిలో మళ్లీ మెరిసిన నరహరిశెట్టి ప్రసాద్ :** ఈ నాటికలో కరణం పాత్రలో నటించిన నరహరిశెట్టి ప్రసాద్ ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా జాతీయ అవార్డు అందుకున్నారు. ఆయనకు జాతీయస్థాయిలో అవార్డు రావడం ఇది నాలుగోసారి. అలాగే గుడివాడకు చెందిన కుమారి కుసుమ ప్రత్యేక జ్యూరీ అవార్డును సొంతం చేసుకున్నారు.

## విజయ దుర్గమ్మ సన్నిధిలో దసరా సందడి

-శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట స్తంభ ప్రతిష్ట



**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దేవస్థాన కమిటీ, ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో పందిరి రాట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా పసుపు కొట్టి ఉత్సవ రాటను ప్రతిష్ఠించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పందిరి రాట ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పవన్ కళ్యాణ్ కృషితో మోడల్ నియోజకవర్గంగా పిఠాపురం

-కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**పిఠాపురం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రెండు రోజుల పిఠాపురం పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం పిఠాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. పవన్ కళ్యాణ్ కృషితో పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 53 వేల ఎకరాలకు సాగునీరు, పిఠాపురంలో రూ.230 కోట్ల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, గత డంపింగ్ యార్డు స్థలాన్ని 5.60 ఎకరాల్లో ఆహ్లాదకర ప్రాంతంగా అభివృద్ధి, ఉప్పాడలో 1,258 మత్స్యకార బోట్లకు భద్రతా పరికరాలు, తీర రక్షణకు రూ.323 కోట్ల కేటాయింపు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు.జలజీవన్ మిషన్ కొనసాగింపునకు ప్రత్యేక చొరవతో పాటు,రాష్ట్రంలో అమలవుతున్న మ్యాజిక్ డ్రైనేజీ విధానానికి దేశవ్యాప్త గుర్తింపు వచ్చేలా కృషి చేశారని తెలిపారు. పిఠాపురం సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## మైలవరంలో ఘనంగా పోషణ మాసోత్సవం

-థీమ్-3 సమాజ భాగస్వామ్యం మరియు జవాబుదారీతనం





**మైలవరం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** జాతీయ పోషణ మాసోత్సవంలో భాగంగా మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఓ కె.పుష్పలత ఆధ్వర్యంలో థీమ్-3( సమాజ భాగస్వామ్యం మరియు జవాబుదారీతనం) అంశంపై తల్లులకు అవగాహన సదస్సు,ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోషణ మాసం, సమాజ భాగస్వామ్యం,కనీసం ఒక ౯ాచీజ సమావేశం తప్పనిసరిగా నిర్వహించడం, ౯ాచీూ మెనూ బోర్డు ప్రదర్శన,లబ్ధిదారుల హక్కులపై అవగాహన, తల్లుల కమిటీ ల ద్వారా భోజనం నాణ్యత, పరిమాణం,మెనూ పాటించడం,సేవల క్రమబద్ధతపై పర్యవేక్షణ తదితర అంశాలపై సిడిపిఓ పుష్పలత తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర పై మైలవరం పట్టణంలోని పురవీధుల లో అవగాహన ర్యాలీ,మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెడన పట్టణ అభివృద్ధికి రూ.12 కోట్ల పనులకు శంకుస్థాపన..

● పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే కాగిత





**పెడన,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** పెడన పట్టణాన్ని పరిశుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో రూ.11,359 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం కడపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా పెడన పురపాలక సంఘ పరిధిలో పట్టణ మౌలిక సదు-పాయాల అభివృద్ధికి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద మంజూరైన రూ.12 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పెడన పట్టణం బ్రహ్మపురం రోడ్డులోని దేవాంగ కళ్యాణ మండపంలో మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పెడన నియోజకవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలిసి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెడన పట్టణ పరిధిలో ఒకేసారి సుమారు రూ.12 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగడం పట్టణ అభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. రోడ్డు విస్తరణ సీసీ రోడ్లు సీసీ డ్రైన్ల నిర్మాణం తదితర మౌలిక వసతుల పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సింగపూర్ నగరం పరిశుభ్రత క్రమశిక్షణతో అభివృద్ధి చెందిన తీరును ఉదాహరణగా పేర్కొంటూ ప్రజలు ప్రభుత్వం కలిసి పనిచేస్తే పట్టణాలను మరింత సుందరంగా తీర్చిదిద్దవచ్చన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల డ్రైన్లు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహించడం దోమలు పెరగడం వంటి సమస్యలు తలెత్తడంతో పాటు కొత్తగా నిర్మించిన రోడ్లు కూడా దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు. రూ.12 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నందున రోడ్లకు అడ్డంగా ఉన్న మెట్లు ఇతర నిర్మాణాలను తొలగించాల్సి వస్తే ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీసీ రోడ్లకు అవసరమైన క్యూరింగ్ ప్రక్రియను కాంట్రాక్టర్లు సక్రమంగా చేపడుతున్నారా లేదా ప్రజలు కూడా పర్యవేక్షించాలని సూచించారు. పెడన పట్టణానికి నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అంచనాలు రూపొందించి పనులకు అనుమతులు వచ్చేలా కృషి చేసిన పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ తదితరులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీఓ కే సాంబశివరావు పబ్లిక్ హెల్త్ డిఈ ప్రవీణ్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్ బాబు పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూమ్( హన్ను )స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాల్లో అన్నదాన మహోత్సవము

- సీఎంఆర్ సేవకు భక్తుల ప్రశంసలు..



**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** స్థానిక ఏలూరు రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏలూరు రోడ్డు, టైలరింగ్ స్ట్రీట్ ప్రముఖుల సహకారంతో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని, సీఎంఆర్ మేనేజర్ నాగరాజుతో కలిసి అన్నదానాన్ని ప్రారంభించారు. అంతకుముందు సీఎంఆర్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సహకారంతో ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అని హరికుమార్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో లంకపల్లి లాజర్, తాటి రాజేష్, బత్తుల ప్రసాద్, నాగేశ్వరరావు, కలిపిండి సతీష్, టాప్ టైలర్, మల్లేష్, జాజుల తాతారావు, శివ ఇంటీరియర్స్ ఎం. శివ, అత్తులూరి బాలాజీ, సీఎంఆర్ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు..



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గ్రామంలో శ్రీ గణేష్ యువసేన కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 2,000 మంది భక్తులకు మహా అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గజరాజు వాహనంపై కొలువుదీరిన గణేష్ మహారాజును మేళతాళాలు, డీజే బాక్సుల నడుమ ఘనంగా ఊరేగించారు. యువత ఉత్సాహంగా పాల్గొనగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుడికి భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. ఆగిరిపల్లి ఎస్సై నాగరాజు పర్యవేక్షణలో పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షించడంతో ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు, ఆగిరిపల్లి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పల్లగాని గంగాధర్ (స్వామి), టీడీపీ గ్రామ అధ్యక్షుడు పామర్తి రామాంజనేయ కుమార్, నాయకులు మందలపు రామసురేష్, పల్లగాని రాంబాబు, మందలపు సాయి, మందలపు ప్రసన్న, శ్రీ గణేష్ యువసేన కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెడన మున్సిపాలిటీ ఓటర్ల జాబితా ప్రచురణ



**పెడన,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** పెడన మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. వార్డుల పునర్విభజనకు అనుగుణంగా సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలోని వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించినట్లు నోటీసులో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పు, తొలగింపు లేదా వివరాల్లో అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారికి తగిన దరఖాస్తు ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు వచ్చిన చేర్పులు తొలగింపులు సవరణలకు సంబంధించిన ఆదేశాలను మున్సిపల్ ఓటర్ల జాబితాలో పొందుపరుస్తామని అధికారులు తెలిపారు.

## బైక్ దొంగలకు 10 నెలల జైలు శిక్ష

**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహన చోరీ కేసుల్లో నిందితులు గుడివాడ AJFCM కోర్టు 10 నెలల జైలు శిక్ష విధించింది. 17.12.2025న ఘా 16 జీ 2963 నంబరు గల హోండా యూనికార్న్ (రూ.80 వేలు), మరో ఘటనలో AP 39 BK 9705 నంబరు గల హోండా యూనికార్న్ (రూ.90 వేలు) చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితులు దాసరి దుర్గా ప్రసాద్, శక ప్రసాద్ ఏ చిన్నాలను 17.02.2026న అరెస్ట్ చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కృష్ణా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో, డిఎస్పీ పాల శ్రీనివాస్ పర్యవేక్షణలో సిఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ పి.కుమార్ రాజా, కోర్టు పిసి 628 పి.రాంబాబు సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఎపిపి ఆర్. గీత వాదనలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి డి. అరుణ 21.09.2026న ఇద్దరికి 10 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## గురువులను అవమానిస్తే ఏసుప్రభువు కూడా క్షమించడు

– జగన్ పై మజ్జాడ నాగరాజు ధ్వజం




**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** విజయవాడ శాప్ కార్యాలయం వద్ద 2025 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణుల దాడిని కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏ ఉద్యమం జరిగినా బాధితులు ఉంటారని, కానీ ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ చేస్తున్నది విచిత్రమైన ఉద్యమమని విమర్శించారు. తమకు అన్యాయం జరిగిందని చెప్పే బాధితులే లేకుండా, కేవలం రాజకీయ లబ్ధి కోసం డీఎస్సీ నియామకాలపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. ప్రతిరోజూ అబద్ధాలతో, అవాస్తవ ఆరోపణలతో పిల్లల ముందే గురువులను అవమానపరుస్తున్నారని, వైసీపీ గొడ్డలి పార్టీ చేస్తున్న ఈ చర్యల వల్ల రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్తు సర్వనాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను అవమానిస్తున్న తీరును చూస్తే జగన్మోహన్ రెడ్డిని ఆయన తల్లిదండ్రులతో పాటు ఆయన నమ్ముకున్న ఏసుక్రీస్తు కూడా క్షమించరని ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. గురువులను అవమానపరిచే విధంగా వైసీపీ చేస్తున్న ఈ రాజకీయాల వల్ల రాబోయే రోజుల్లో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, ఉపాధ్యాయుల విషయంలో జగన్ ప్రవర్తిస్తున్న తీరును ఏసు ప్రభువు కూడా క్షమించడని ఆయన హెచ్చరించారు.

## ఎన్టీఆర్ కాలనీలో వెంటాడుతున్న శిథిల భయం

– పట్టించుకోని అధికార యంత్రాంగం



**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** స్థానిక ఎన్టీఆర్ కాలనీ ఆర్చి ప్రక్కన ప్రధాన రహదారిపై ఉన్న బి.సి. బాలికల వసతి గృహ భవనం గత పదేళ్లుగా శిథిలావస్థలో దెయ్యాల కొంపలా మారింది. పైకప్పు కూలిపోయి, గోడలు పగుళ్లు పట్టి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉంది.

**సాయంత్రమైతే భయమే భయం :** ఈ భవనం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి లైటు కూడా లేకపోవడంతో సాయంత్రం అయితే ఆ దారిలో నడవాలంటేనే భయమేస్తోందని చెబుతున్నారు. శిథిల భవనంలో పాములు తిరుగుతున్నాయని, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఆరోపిస్తున్నారు.

**వినతులు బుట్టదాఖలు :** ఈ భవనాన్ని తొలగించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దశాబ్దం గడిచినా అధికారులు కళ్లు తెరవకపోవడం దారుణమని మండిపడుతున్నారు.

**ప్రజల డిమాండ్ :** ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదకరంగా మారిన ఈ శిథిల భవనాన్ని తక్షణమే కూల్చివేసి, ఆ ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేసి తాము నిర్భయంగా తిరిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

## టీచర్లను మద్యం షాపుల దగ్గర కాపలా పెట్టిందెవరు ?

–బీజేపీ నేత సూరే గాంధీ ఫైర్

**గుడివాడ,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** విజయవాడ లోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ పేరుతో వైకాపా నాయకులు జరిపిన దాడిని బీజేపీ మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) తీవ్రంగా ఖండించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇలాంటి దాడులు వైకాపా నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఎంతో కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అవమానపరిచేలా మాట్లాడటం సభ్య సమాజం హర్షించదని మండిపడ్డారు. గతంలో పవిత్రమైన ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టిన ఘనత వైకాపాదేనని, ఆ విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైకాపా ఇలాంటి కుట్రలు చేస్తోందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైకాపాకు అభ్యర్థులు కూడా దొరకరని, ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డీఎస్సీపై అనుమానాలు ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా సలహాలు ఇవ్వాలని, లేదంటే కోర్టు మెట్లు ఎక్కాలని సవాల్ విసిరారు.

## మోదీ జన్మదినం సందర్భంగా పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మంగళవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 161 మంది వైద్య సేవలు పొందారు. వారికి ఉచిత వైద్యం, ఉచిత మందులతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. గర్భిణీలు, మహిళల కోసం ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 40 స్కానింగ్‌లు, 16 మందికి ఎక్స్‌రేలు, 16 మందికి గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యులు 32 మందికి, కంటి వైద్యులు 50 మందికి వైద్య పరీక్షలు, సేవలు అందించారు. మానసిక వైద్య నిపుణులు హాజరైన వారికి కౌన్సెలింగ్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈదర గ్రామపంచాయతీ గ్రామ నాయకులు జి.ఆర్.కె. రంగారావు, మాజీ సర్పంచ్ బి. వెంకట నరసింహారావు హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్ ముందుండి నిర్వహించారు. శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన పీహెచ్‌సీ సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలందరికీ సురక్షితమైన, స్వచ్ఛమైన తాగు నీరందించేలా చర్యలు

- నీటి సరఫరాలో నాణ్యతా లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ
- ఆధునీకరించి నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచి నీటి పథకాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- దాదాపు రూ. 10 కోట్ల జేజేఎం-అమరజీవి జలధార నిధులతో నాగులాపల్లి మంచి నీటి పథకం పునరుద్ధరణ
- ఉప ముఖ్యమంత్రి వర్యుల ప్రత్యేక చొరవతో పనులు పూర్తి
- 52 ఆవాసాలు.. 97 వేల మందికి తాగునీటి కష్టాల నుంచి ఉపశమనం
- కొత్త నిర్మాణాలను పరిశీలించి.. స్వయంగా నీటి నాణ్యత పరీక్షించిన డిప్యూటీ సిఎం.

**పిఠాపురం,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ప్రజలందరికీ సురక్షితమైన, స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో నాణ్యతా లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం దాదాపు రూ. 10 కోట్లతో ఆధునీకరించిన పిఠాపురం నియోజకవర్గం నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచి నీటి పథకాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార నిధులతో ఆధునీకరణ పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో విషయం సాధించిన తరువాత చేపట్టిన పర్యటనలో- పవన్ కళ్యాణ్ దృష్టికి వాకపల్లి, ఇసుకపల్లి, నాగులాపల్లి, కొండెవరం, యు. కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత ఆవాసాలకు చెందిన ప్రజలు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, అరకొర నీటితో సరిపెట్టుకోవాల్సి వస్తోందన్న విషయాన్ని దృష్టికి తీసుకువచ్చారు. ఆ సందర్భంలో నాగులాపల్లి మంచినీటి పథకాన్ని, వాకపల్లి చెరువును స్వయం89గా పరిశీలించారు. గతంలో నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకం నిర్మించినప్పుడు మనిషికి 40 లీటర్ల తాగునీటి సరఫరా లక్ష్యంగా నిర్ధారించారు. అయితే నిర్మాణం చేపట్టినప్పటితో పోలిస్తే ఆవాసాల సంఖ్య, ప్రజల సంఖ్య గణనీయంగా పెరగడంతో వారి అవసరాలకు సరిపడా తాగునీటి సరఫరా కష్టసాధ్యంగా మారింది. సమస్యను గుర్తించిన పవన్ కళ్యాణ్ జేజేఎం-అమరజీవి జలధార నిధులతో తక్షణం నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఇంటేక్ వెల్ సామర్థ్యాన్ని పెంచేందుకు మూడు 20 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేశారు. నవఖండరాడ నుంచి శుద్ధి చేయని నీటిని వాకపల్లి వరకు తరలించేందుకు 3.8 కిలోమీటర్ల మేర భారీ పైపు లైన్ వేశారు. నీటిని



శుద్ధి చేసేందుకు రెండు మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేశారు. దీంతోపాటు మూలపేట గ్రామంలో పాత పైపు లైన్ దెబ్బతినడంతో కొత్త పైపు లైన్ ఏర్పాటు చేశారు. సంపులు, ట్యాంకులు మొత్తాన్ని పునరుద్ధరించి నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేశారు. పిఠాపురం పర్యటనలో భాగంగా నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని సందర్శించి, ఆధునీకరించిన విభాగాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆధునీకరణకు సంబంధించిన ఫోటో గ్యాలరీని వీక్షించారు. కొత్త వాటర్ పైప్ లైన్ మ్యాప్ ను పరిశీలించారు. యు. కొత్తపల్లి మండల పరిధిలోని 51 ఆవాసాలు, పిఠాపురం రూరల్ మండల పరిధిలోని ఒక ఆవాసానికి తాగునీటి కష్టాలు తీర్చారు. దాదాపు 97 వేల మందికి పైగా రోజుకు తలకు 55 లీటర్ల రక్షిత తాగునీటిని అందించే విధంగా తీర్చిదిద్దారు.

**ల్యాబ్‌లో నీటి నాణ్యత పరీక్ష..** గత పర్యటనలో గుర్తించిన లోపాలు, పునరుద్ధరణ ప్రక్రియలో నూతనంగా ఏర్పాటు చేసిన యంత్రాలు, పైపులు, సంపులను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకం నీటి సరఫరా మ్యాప్‌ను తిలకించారు. అనంతరం ల్యాబ్‌లో నీటి నాణ్యతను స్వయంగా పరీక్షించారు. నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకానికి ప్రధాన నీటి వనరు అయిన చెరువుని పరిశీలించారు. తాగునీటి చెరువు చుట్టు పక్కల కాలుష్య కారకాలైన జలాలు ఏమైనా విడుదల అవుతున్నాయా? అని అధికారులను ఆరా తీశారు. అనంతరం నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకానికి సమీపంలో ఉన్న కొండెవరం గ్రామాన్ని సందర్శించి, బర్రె లక్ష్మణ దాసు ఇంటి వద్ద ట్యాప్ తిప్పి నీటి సరఫరాను పరిశీలించారు. గృహాల వద్ద కుళాయిల్లో వస్తున్న నీటి నాణ్యతను పరిశీలించి, తాగునీటి అవసరాలకు సరిపడినంతగా నీరు అందుతుందా అని వాకబు చేశారు. పునరుద్ధరణ తర్వాత నీటి కష్టాలు తీరాయని బర్రె లక్ష్మణ దాసు కుటుంబ సభ్యులు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. గతంలో కుళాయి ద్వారా మూడు బిందెల నీరు మాత్రమే వచ్చేవని, ఇప్పుడు పది బిందెలకు వరకు వస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ, రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ, నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

**గ్రామీణ తాగునీటి సరఫరా..** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం నిజమైన ప్రజాసేవ! నాగులాపల్లి పథకం ఆధునీకరణతో 52 ఆవాసాల్లో సుమారు 97 వేల మందికి ఉపశమనం కలగడం సంతోషకరం. నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణతో ఈ సదు-పాయం ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి.

# విద్యాశాఖలో సమగ్ర కేడర్ వ్యవస్థను రూపొందించాలి

- ఉపాధ్యాయులకు అర్హత, అనుభవం ఆధారంగా లిలి స్పష్టమైన పదోన్నతి అవకాశాలు కల్పించాలి
- హైస్కూల్ ప్లస్‌లలో రెగ్యులర్ పీజీటీ కేడర్ ఏర్పాటు చేయాలి
- సర్వీస్ నిబంధనల సమగ్ర సమీక్షకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అమరావతి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పాఠశాల విద్య 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విస్తరిస్తున్న నేపథ్యంలో, అందుకు అనుగుణంగా బోధనా కేడర్లు, పాఠశాల నాయకత్వం, ఉపాధ్యాయ విద్య--విద్యా పరిశోధన, క్షేత్రస్థాయి విద్యా పరిపాలన వ్యవస్థలను సమగ్రంగా సమీక్షించి, అర్హులైన ఉపాధ్యాయులకు స్పష్టమైన పదోన్నతి, వృత్తిపరమైన పురోగతి అవకాశాలు కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాసరావు లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సంఘం సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల ఏర్పాటుతో 11, 12 తరగతుల బోధన, పాఠశాల నాయకత్వం, విద్యా సహకారం, ఉపాధ్యాయ శిక్షణ, క్షేత్రస్థాయి విద్యా పరిపాలనలో అదనపు బాధ్యతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్--2025 నేపథ్యంలో జరుగుతున్న స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణతో పాటు విద్యాశాఖలోని కేడర్ నిర్మాణం, సర్వీస్ నిబంధనలు, పదోన్నతి మార్గాలను కూడా సమగ్రంగా పరిశీలించాలని కోరారు.

**ఎస్జీటీ నుంచి పీజీటీ వరకు పదోన్నతి మార్గాన్ని పరిశీలించాలి..** ఎస్జీటీ/నిర్దేశిత ప్రాథమిక ఉపాధ్యాయ కేడర్ ? స్కూల్ అసిస్టెంట్ ? పీజీటీ వరకు అర్హతలు, నియామక విధానం, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా నిరంతర బోధనా పదోన్నతి మార్గాన్ని రూపొందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో రెగ్యులర్ పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) కేడర్‌ను ఏర్పాటు చేసి, అవసరమైన అర్హతలు కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీగా పదోన్నతి/నియామక అవకాశం కల్పించే విధానాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ అవకాశం పరిశీలించాలని కోరామన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ కేడర్‌లో బదిలీ ద్వారా నియామకం లేదా ఇతర చట్టబద్ధమైన విద్యాపరమైన పురోగతి అవకాశం కల్పించే సాధ్యాసాధ్యాలను ప్రస్తుత సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని కోరారు. ఈ అంశంలో జి.ఓ.ఎం.ఎస్.నెం.302, తేదీ 30-12-1993ను ప్రస్తుతం అమలులో ఉన్న హక్కుగా కాకుండా, గతంలో ఉన్న విధానానికి ఒక ప్రాతిపదికగా



మాత్రమే పరిశీలించాలని సంఘం స్పష్టం చేసినట్లు తెలిపారు.

**ప్రతి విద్యా స్థాయికి తగిన పాఠశాల నాయకత్వం ఉండాలి..** ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, హైస్కూల్ ప్లస్‌ల అవసరాలు వేర్వేరుగా ఉన్నందున విద్యార్థుల సంఖ్య, మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు, ప్రయోగశాలలు, పబ్లిక్ పరీక్షలు, 11--12 తరగతుల నిర్వహణ బాధ్యతలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక/ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యాయుడు, డిప్యూటీ హెడ్‌మాస్టర్, హెడ్‌మాస్టర్, వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్ పోస్టుల అవసరాన్ని సమీక్షించాలని కోరారు. పాఠశాలలకు సమీపస్థాయిలో ఉపాధ్యాయులకు విద్యాపరమైన మార్గదర్శకత్వం, తరగతి గది పరిశీలన, విద్యార్థుల అభ్యసన ఫలితాల సమీక్ష, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా ప్రణాళిక వంటి అంశాల కోసం క్లస్టర్ స్థాయి విద్యా సహాయక వ్యవస్థ ఏర్పాటును పరిశీలించాలని కోరారు.

**ఎంఈఓ--డిప్యూటీ ఈఓ వ్యవస్థను సమీక్షించాలి.....** ఎంఈఓ--1, ఎంఈఓ--2 పోస్టుల విధులు, అర్హత గల దిగువ కేడర్లు, సీనియారిటీ, పదోన్నతి అవకాశాలు, సర్వీస్ నిబంధనలపై సమగ్ర సమీక్ష జరపాలని కోరారు. అలాగే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల పరిధులను మండలాల సంఖ్య, పాఠశాలల సంఖ్య, విద్యార్థుల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, పాఠశాలల తనిఖీ బాధ్యతల ఆధారంగా పనిభార అధ్యయనం చేసి అవసరమైన మార్పులను నిర్ణయించాలని కోరారు. అదే విధంగా డైట్, ఎస్‌సీఈఆర్‌టీ, సీటీఈ, ఐఏఎస్‌ఈ వంటి ఉపాధ్యాయ విద్య, విద్యా పరిశోధనా సంస్థల్లో అవసరమైన రెగ్యులర్ విద్యా కేడర్లను పరిశీలించాలని కోరారు. నిర్దేశిత అర్హతలు కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీలు, ప్రధానోపాధ్యాయులు, డైట్ సిబ్బందికి నిబంధనలకు అనుగుణంగా ఈ సంస్థల్లో పనిచేసే, ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయి విద్యా పరిపాలనలో డిప్యూటీ ఈఓ ? డీఈఓ/డిప్యూటీ డైరెక్టర్ ? జాయింట్ డైరెక్టర్/రీజినల్ జాయింట్ డైరెక్టర్ ? అదనపు డైరెక్టర్ ? డైరెక్టర్ స్థాయిల వరకు అర్హతలు, దిగువ కేడర్లు, నియామక--పదోన్నతి విధానాలు, సీనియారిటీ అంశాలను సమగ్రంగా సమీక్షించాలని కోరారు. స్థానిక కేడర్లతోపాటే సర్వీస్ నిబంధనలనూ సమీక్షించాలనీ కోరారు. స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణను ఒక్క అంశంగానే చూడకుండా మంజూరైన పోస్టుల సంఖ్య, స్థానిక కేడర్ వర్గీకరణ, నియామక యూనిట్, సీనియారిటీ యూనిట్, పదోన్నతికి అర్హమైన దిగువ కేడర్లు, రిజర్వేషన్--రోస్టర్, వేతన సాపేక్షత, ఆర్థిక ప్రభావం, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీస్ హక్కుల పరిరక్షణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు.

**ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలిలి..** ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసేందుకు పాఠశాల విద్య, సాధారణ పరిపాలన, ఆర్థిక, న్యాయ శాఖల ప్రతినిధులతో పాటు విద్యారంగ, సర్వీస్ నిబంధనల నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కమిటీ ముందు రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలకు కూడా తమ అభిప్రాయాలు, సూచనలు, ప్రతిపాదనలు తెలియజేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. "1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యావ్యవస్థ విస్తరించినప్పుడు, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేడర్ నిర్మాణం, పాఠశాల నాయకత్వం, విద్యా పరిశోధన--ఉపాధ్యాయ శిక్షణ, క్షేత్రస్థాయి విద్యా పరిపాలన, పదోన్నతి అవకాశాలు కూడా మారాల్సిన అవసరం ఉంది. అర్హత, అనుభవం, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు స్పష్టమైన వృత్తిపరమైన పురోగతి మార్గాలను కల్పించే దిశగా ప్రభుత్వం సమగ్ర నిర్ణయం తీసుకోవాలి" అని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు

# బురదలో కూరుకుపోయి మా మీద బురద చల్లుతారా....??

-పేర్ని నానిని ప్రశ్నించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** వైసిపి నాయకులు బురదలో కూరుకుపోయి తమపై బురద చల్లుతున్నారని స్థానిక శాసనసభ్యులు కాగిత ప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి పెడనలో జరిగిన వైసిపి నియోజకవర్గ సమావేశంలో పేర్ని నాని శాసనసభ్యుడు కాగితను విమర్శించారు. పేర్ని విమర్శలకు కాగిత సమాధానం చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు మంగళవారం నాడు పెడన వచ్చిన అయన మాట్లాడుతూ దొంగ సంతకాలతో పట్టాలు ఇవ్వడంతో పాటు 90 కోట్ల రూపాయల బియ్యం బొక్కిన పేర్ని ఎదుటివారిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కలంకారి క్లస్టర్ స్థలం కేటాయించని స్థానిక వైసీపీ నాయకులు అభివృద్ధి విరోధకులు అని కాగిత అన్నారు. క్లస్టర్ ను ఎలా ఏర్పాటు చేసుకోవాలో తమకు తెలుసన్నారు.

# శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

- కోడూరు గౌడ్ కమిటీ హాల్ నందు అంగరంగ వైభవంగా అన్నదాన కార్యక్రమం



**జి.కొండూరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం కోడూరు గ్రామంలో శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గౌడ్ కమిటీ హాల్ నందు మంగళవారం అంగరంగ వైభవంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవాల కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ్ కమిటీ హాల్ లో భారీగా అన్నదాన ఏర్పాట్లు చేసి, భక్తులు మరియు గ్రామస్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తిశ్రద్ధలతో గణపతిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు, యువతతో పాటు గ్రామంలోని పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది. ఈ అన్నదాన కార్యక్రమా నికి పలగాని నాగభూషణం సహకారం అందించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం



**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండల వ్యవసాయ కార్యాలయం (కొండ కాలనీ)ప్రాంగణంలో శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1,500 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని భక్తుల ఆర్థిక సహాయంతో పంపిణీ చేశామని వచ్చా కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు ఉత్సాహంగా కోలాటం నిర్వహించి భక్తులను అలరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పాత్రికేయ మిత్రులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మంచి పోషకాహారంతోనే పిల్లల ఎదుగుదల- సిడిపిఓ సముద్రవేణి



**పెడన,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పెడన పట్టణంలోని తోటమూల గుణ్ణాలపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ బంటుమిల్లి పెడన ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం నాడు తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సముద్రవేణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అంగన్వాడీల ద్వారా తాజా వేడి భోజనం అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయ మహాలక్ష్మి సునీత గర్భిణీలు బాలింతలు తల్లులు ఆయాలు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరీకి ఫలితమేది?



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** మండలంలోని గ్రామ రెవిన్యూ సహాయకుల వెట్టి చాకిరీకి ప్రభుత్వం తగిన ఫలితం ఇవ్వటం లేదని వీఆర్ఏల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉడుముల రవికుమార్ ఆరోపించారు. గుడ్లవల్లేరులో వీఆర్ఏలు సమ్మెను మంగళవారం కూడా కొనసాగించారు. తమ గౌరవ వేతనాన్ని రూ.10,500నుంచి రూ.21వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ నాయకులు చార్లెస్, కిరణ్, ఫైజుల్లా, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై దాడులు చేయడం దుర్మార్గం...

- డీఎస్సీ పై వైసీపీ తప్పుడు ఆరోపణలు మానుకోవాలి.....
- ఉపాధ్యాయులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోము....
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్లరమేష్



**అమరావతి,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** ఉపాధ్యాయులపై వైసిపి గొడ్డలి పార్టీ నాయకులు దాడులు చేయటంతో వైసిపి అసలు నైజం బయటపడిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్ విమర్శించారు అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారం ఉన్న ఐదేళ్లు మెగా డీఎస్సీ పేరుతో యువతను దగా చేసిన జగన్ ఇప్పుడు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై వైసిపి గూండాలు దాడులు చేయటం సిగ్గుచేటు అన్నారు ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను ఫేక్ అంటూ అవమానించటము వైసిపి దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని ఆయన తెలిపారు డీఎస్సీ పై వైసీపీ నాయకులు లేనిపోని తప్పుడు ఆరోపణలు చేస్తూ ఉపాధ్యాయుల ఆత్మగౌరాన్ని దెబ్బతీశాలా పాల్పడటాన్ని ఆయన తీవ్రంగా ఖండిచారు డిఎస్పి డీఎస్సీ పై మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని ఆయన ఆయన ఎద్దేవా చేశారు ఉపాధ్యాయులపై దాడులు రౌడీయిజం చేయటమే గొడ్డలి పార్టీ నాయకులా రాజకీయమన్నారు లిక్కర్ స్కాం ను ప్రక్కదారి పట్టించేందుకే గొడ్డలి పార్టీ నాయకులు డీఎస్సీ పేరుతో గొడవలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడానికి ఆయన తీవ్రంగా ఖండించారు వైసీపీ బెదిరింపులకు ఉపాధ్యాయులు అవసరం లేదన్నారు డీఎస్సీ నియమకాలపై గొడ్డలి పార్టీ నాయకులు చర్చకు అసెంబ్లీకి వస్తే సమాధానం చెబుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన ఇంకా గొడవలు చేయటం ఎందుకని ఆయన ప్రశ్నించారు జగన్ రెడ్డి ఇప్పటికైనా డీఎస్సీ పై తప్పుడు ఆరోపణలు తప్పుడు ప్రచారాలు అబండాలు వేయటం మానుకోవాలన్నారు ఉపాధ్యాయులపై అనవసరంగా దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు.

# కోడూరు గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం పై అవగాహన సదస్సు

మండల వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్

**కోడూరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** కోడూరు గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమము పై అవగాహన సదస్సు నిర్వహించారు . ఈ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్ మాట్లాడుతూ సామూహికంగా ఎలుకలను నిర్మూలించేందుకు భాగంగా 96 శాతం నూకలు, 2 శాతం నూనె మరియు 2 శాతం రోడెన్టిసైడ్ మందు మిశ్రమం చేసి , 10 గ్రాముల గా ఎర పొట్లాలుగా తయారు చేసి, రైతులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ ఎర్రల పొట్లాలను, పొలము ఉన్నఎలుకల బొరియలలో ఉంచటం ఉంచడం వల్ల ఎలుకలు తిని చనిపోయి తద్వారా ఎలుకల ఉత్పత్తి ఆగిపోతుందని, ఇలా ఏర్పాటు చేయడం వల్ల ఎలుకల భారీ నుండి



విముక్తి పొంది మంచి ఫలితాలు పొందవచ్చు అని మండల వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు , మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సందడిగా వినాయక నిమజ్జనోత్సవాలు..





**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 22 (వార్తాప్రభ) :** మండలంలో పురిటిపాడు, గుడ్లవల్లేరు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలను సందడిగా నిర్వాహకులు నిర్వహించారు. గుడ్లవల్లేరు రజక సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటల్లో శివలింగాకారంలో ఉన్న స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని రూ.42,500కు వల్లూరు వెంకట సాయి శ్రీను దక్కించుకున్నారు. కార్యక్రమంలో బొర్రా వీర గోపాలరావు, యార్లగడ్డ మహేష్, తులశమ్మ, ఫణి, సీతారామయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188